తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
28 సెప్టెంబరు, 2025



# నవరాత్రి నాయకి
# సకల శక్తి స్వరూపిణి

# రవితేజ ఫ్యామిలీ నుంచి మరో హీరో



టాలీవుడ్ ఇండస్ట్రీకి మరో స్టార్ వారసుడు పరిచయం కాబోతున్నాడు. మాస్ మహారాజా రవితేజ సోదరుడు, నటుడు రఘు తనయుడు మాధవ్ భూపతిరాజు 'మారెమ్మ' అనే చిత్రంతో హీరోగా అరంగేట్రం చేస్తున్నాడు. మాధవ్ పుట్టినరోజు సందర్భంగా, చిత్ర బృందం ఈ సినిమాకు సంబంధించిన ఓ ప్రత్యేక గ్లింప్స్ వీడియోను విడుదల చేసి ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది.

విడుదలైన ఈ గ్లింప్స్‌లో మాధవ్ పూర్తి మాస్ అవతారంలో కనిపించి ఆకట్టుకున్నాడు. గుబురు గడ్డం, రగ్గడ్ లుక్‌తో లుంగీ కట్టుకొని నడుస్తున్న తీరు, అతని బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే.. తొలి సినిమాతోనే బలమైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యాడని స్పష్టమవుతోంది. ఈ వీడియోతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగాయి. ముఖ్యంగా మాధవ్ స్క్రీన్ ప్రెజెన్స్, ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్స్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

మాచర్ల నాగరాజు దర్శకత్వం వహిస్తున్న 'మారెమ్మ' చిత్రాన్ని మయూర్ రెడ్డి బండారు నిర్మిస్తున్నారు. ఇది పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎమోషనల్ డ్రామా అని చిత్ర యూనిట్ తెలిపింది. వాస్తవిక ఘటనల స్ఫూర్తితో, సహజమైన వాతావరణంలో ఈ సినిమాను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాతలు వెల్లడించారు. ఈ సినిమాలో మాధవ్ సరసన దీపా బాలు హీరోయిన్‌గా నటిస్తోంది. వికాస్ వశిష్ఠ, వినోద్ కుమార్, దయానంద్ రెడ్డి, రూపా లక్ష్మి వంటి నటులు ఇతర కీలక పాత్రలలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ప్రశాంత్ విహారి సంగీతం సమకూరుస్తున్నారు.

బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ త్వరలో తెలుగు తెరపై కనిపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రంలో ఆయన కీలక పాత్రలో నటించనున్నారని హిందీ సినీ పరిశ్రమలో ప్రచారం జోరుగా సాగుతోంది.

# 'ఫౌజీ'లో అభిషేక్ బచ్చన్?

ప్రభాస్ కథానాయకుడిగా, హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం 'ఫౌజీ' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో ఓ ప్రధాన పాత్ర కోసం అభిషేక్ బచ్చన్‌ను సంప్రదించినట్లు సమాచారం. ఆయన కూడా వెంటనే అంగీకరించారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. కానీ బాలీవుడ్ వర్గాల సమాచారం ప్రకారం అభిషేక్ బచ్చన్ పాత్ర చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని అంచనా. అభిషేక్ తండ్రి అమితాబ్ బచ్చన్ ఇదివరకే తెలుగు చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల హృదయాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే!



ఆదివారం వార్త

28 సెప్టెంబరు, 2025

## మంచి ముత్యాలు

– పొరపాట్లు జీవితంలో ఒక భాగమే. విద్య, వ్యాపారం, క్రీడలు దేంట్లోనైనా మనం నేర్చుకునేది మన పొరపాట్ల నుండే. – బెత్‌డే

– నిశ్శబ్దానికి చిన్న మార్పు ప్రసంగం. – జార్జి మెరిడిత్

## కదంబం

'సంఘీ'భావం....5
హైదరాబాద్‌ను హడలెత్తిస్తున్న భారీ వర్షాలు

కవర్ స్టోరీ..6
నవరాత్రి నాయకి సకలశక్తి స్వరూపిణి

ఈ వారం కవిత్వం...12
ఏకాంతమే ఆత్మకి ఆహారం

కథ..20
వాడినపూలు వికసించునా?

సాహిత్యం.. 23
పుస్తకం ఎటు పోతోంది?

ప్రకృతి ఒడిలో పశుపతినాథుడు.. 26


ఇంకా...
మొగ్గ
వారఫలం
వంటలు
వగైరా.. వగైరా..

## సమాచారం

### వృక్షాలు మాట్లాడుకుంటాయా?



చెట్లు సైతం మిగతా ప్రాణుల్లా మాట్లాడుకుంటాయని, అవి వాటి సామాజిక నెట్‌వర్క్‌లో భాగమని శాస్త్రజ్ఞులు తమ పరిశోధనల ద్వారా నిర్ధారించారు. 'ఉడ్ వైడ్ వెబ్' అని పిలిచే భూగర్భ మైకోరైజల్ ఫంగస్ నెట్‌వర్క్ ద్వారా కమ్యూనికేట్ చేస్తాయని అంటున్నారు.



నీరు, పోషకాలు మొదలైనవాటి గురించి తెలుసుకోవడం, ఏవైనా ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు వాటిని ముందుగానే గుర్తించి హెచ్చరించడం లాంటి చర్యల ద్వారా వృక్షాలు మాట్లాడుకుంటాయని తెలుస్తోంది. ఈ నెట్‌వర్క్ చెట్ల రూట్ సిస్టమ్‌లను కలుపుతుంది. ఇది మానవ మెదడు న్యూరాన్‌ల వంటిది.

ఓ శాస్త్రవేత్త తన పరిశోధనను పబ్లిష్ చేస్తూ పేపర్ బిర్చ్, డగ్లస్ ఫిర్ చెట్ల మధ్య కార్బన్ బదిలీని రేడియో ఆక్టివ్ ఐసోటోప్‌లతో ట్రాక్ చేసినట్లు తెలిపారు. బిర్చ్ చెట్టు అధిక కార్బన్‌ను ఫిర్ చెట్టుకి పంపితే తరువాత ఫిర్ చెట్టు బిర్చ్ చెట్టుకి కార్బన్‌ని పంపింది. ఇది చెట్ల పరస్పర సహకారాన్ని చూపిస్తుంది. మరో ప్రయోగంలో గాయపడిన డగ్లస్ ఫిర్ చెట్టు పొరుగు చెట్టయిన పాండెరోసా పైన్‌కు రక్షణ ఎంజైమ్‌లను ఉత్పత్తి చేయమని సిగ్నల్ పంపంగా అది ప్రతిస్పందించింది. ఇలాంటి అనేక పరిశోధనల తర్వాత ఇతర జీవుల్లానే చెట్లు కూడా మాట్లాడుకుంటాయన్న నిర్ధారణకు శాస్త్రవచ్చారు వచ్చారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com




## జాలి

పోలీస్: గుడిలో హుండీ పగలగొట్టి డబ్బంతా తీసుకెళ్లావు కదా.. వెయ్యి రూపాయలు మిగిల్చావు, ఎందుకని?

దొంగ: పొద్దున ఒక భక్తుడు ఆ వెయ్యి రూపాయలు హుండీలో వేస్తూ వాళ్ళింట్లో వాళ్ళకి ఆరోగ్యం బాగుపడాలని కోరుకున్నాడు. జాలి వేసి ఆ వెయ్యి రూపాయలు తీసుకోలేదు.



## తప్పేంటి?

పూజారి: ఇలా ప్రేమికులు గుడికి రాకూడదు కదా..చదువుకోవాల్సిన వయసులో ఏంటి ఈ పనులు?

ప్రేమికులు: ప్రేమికులు గుడిలో పెళ్లి చేసుకుంటున్నారు కదా.. పెళ్లికి ముందు వస్తే తప్పేంటి?

## చేపల కూర ఉందిగా..

యజమాని: రోజూ మిగిలిపోయిన కూరలు తీసుకెళ్తూ ఉంటావు కదా! ఈరోజు తీసుకెళ్లడం లేదేంటి?

పనిమనిషి: వేరే ఇంట్లో కూడా పని చేస్తాను కదండీ.. ఇవాళ వాళ్లింట్లో చేపల కూర ఉంది అది తీసుకెళ్తాను.

**– ఎస్ కె.యాకూబ్ పాషా,**
ఖమ్మం.

## నువ్వుగింజ నానదుగా!

భార్య: పెద్ద పెద్ద కంపెనీల్లో డైరెక్టర్లుగా మహిళలు. ఉండరు, ఎందుకు?

భర్త: ఎందుకంటే మహిళలకు నోట్లో నువ్వుగింజ నానదు కాబట్టి.

**– కె.లహరి**

## సలహా

అనిల్: ఒరేయ్ నానీ, ఏమి చెప్పినా ఎలా చెప్పినా మా ఆవిడ వినదురా? ఏదైనా సలహా చెప్పరా!

నాని: ఆ విషయం తెలియకనే కదా నేను ఆదివారం కూడా ఆఫీసుకు వస్తున్నాను.

## ఈ జన్మలో ఉన్నాడుగా..

కార్తిక: మరో జన్మ అంటూ వుంటే మనం కలిసి జీవిస్తాం.

నాని: అదేమిటి? అలా అంటున్నావు? ఈ జన్మకి మరి.

కార్తిక: ఈ జన్మకి మా ఆయన ఉన్నాడుగా!

## బతికే వున్నాడు

నర్స్: డాక్టర్, మార్చురీలో వున్న శవం లేచి కూర్చుంది.

డాక్టర్: కంగారుపడకు.. బెడ్ ఖాళీ లేక ఒక రోగిని మార్చురీలో ఉంచాం.

## నడవలేనుగా..

ఎస్.ఐ: మీరు బాగా తాగి వున్నారు. ఈ పరిస్థితిలో డ్రైవ్ చేయకూడదు. చాలా ప్రమాదం.

ప్రదీప్: నేను వున్న పరిస్థితుల్లో నడవలేనుగా మరి!

## భయం వద్దు..

డాక్టర్: రమ్యా, ఏం భయపడకు నేను చక్కగా ఆపరేషన్ చేస్తున్నాను.

నర్స్: ఆమె రమ్య కాదు, నళిని.

డాక్టర్: నాకు తెలుసు. నాకు నేను ధైర్యం చెప్పుకుంటున్నాను.

**– ఈ.ఎస్.మాధవన్**

---



## ప్యారడీ పాట

"మూగమనసులు" చిత్రంలోని "పాడుతా తీయగా.. చల్లగా.." పాటకు ప్యారడీ.

పల్లవి: తోముతా మెల్లగా తెల్లగా
తళతళ మెరిపించే సూపర్రిన్ సబ్బులా
క్లోజప్ పేస్టులా ॥తోముతా॥

చరణం: రోస్ట్ చేస్తే గిన్నె కాస్త మాడిపోతది
మాడిపోతే కూరలన్నీ కంపుకొడతవి
రోస్ట్ చేస్తే గిన్నె కాస్త మాడిపోతది
మాడిపోతే కూరలన్నీ కంపుకొడతవి
కంపుగొట్టు కూర తింటే ఏమి లాభమూ ॥2॥
కోటి విద్యలన్ని కూడ కూటికోసమే.
॥తోముతా॥

చరణం: పరిశుభ్రత ఉంటేనే ప్రతి ఇంట ఆనందం
లేకపోతే ప్రతి గదిలో రోగి మంచం
పరిశుభ్రత ఉంటేనే ప్రతి ఇంట ఆనందం
లేకపోతే ప్రతి గదిలో రోగి మంచం
పని మనుషులు అందరూ మంచోళ్ళు /2/
రోగాలను మట్టుపెట్టు డాక్టర్లు ॥తోముతా॥

చరణం: మనీ పోతే మాత్రమేమి హెల్తు ఉంటది
హెల్త్ ఉంటే వెల్తు అదే కూడుకుంటది
మనీ పోతే మాత్రమేమి హెల్తు ఉంటది
హెల్త్ ఉంటే వెల్తు అదే కూడుకుంటది
నా మాటలు పిడిఎఫ్ ఫైల్స్ లాంటివి ॥2॥
మార్పు చేయాలంటే ఒప్పనంటవి ॥తోముతా॥

**– దాసరి చంద్రయ్య**

## 'సంఘీ' భావం



# హైదరాబాద్‌ను హడలెత్తిస్తున్న భారీ వర్షాలు

ప్రకృతిలో వస్తున్న మార్పులు, జనజీవనంలో తప్పిదాలు హైదరాబాద్ నగరానికి శాపంగా పరిణమించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కురుస్తున్న కుండపోత వర్షాల వల్ల జనజీవనం స్థంభించిపోతోంది. కేవలం కొన్ని గంటల వ్యవధిలో 15 నుంచి 20 సెంటీమీటర్ల వర్షం కురియడంతో అనేక ప్రాంతాల చెరువులను తలపిస్తున్నాయి. సుమారు ఆరేడు దశాబ్దాల క్రితం నిర్మించిన డ్రైనేజీ వ్యవస్థ వర్షం నీరు ప్రవహించడానికి వీలులేని పరిస్థితి నెలకొని ఉంది. హైదరాబాద్‌లో దాదాపు 1,295 కి.మీ.ల నీటి కాలువలు, ఉన్నాయి, వీటిలో 73 కి.మీ. సహజ కాలువలు, సైడ్ డ్రెయిన్లు 44 కి.మీ., కవర్డ్ డ్రెయిన్లు 860 కి.మీ. ఓపెన్ డ్రెయిన్లు 316 కి.మీలు ఉన్నాయి. ఇవన్నీ కేవలం ఆరేడు సెంటీమీటర్ల వర్షపునీరు మాత్రమే ప్రవహించేలా చేయగలవు. అంతకు మించితే కాలువలు ఉప్పొంగి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతాయి. ఈ సంవత్సరంలో సుమారు జూలై నెలాఖరు నుంచి దాదాపు ప్రతిరోజూ వర్షం కురుస్తూనే ఉంది. ఇక సెప్టెంబరు నెలలో కుండపోత వర్షాలు మరీ ఎక్కువయ్యాయి. వీటిని సాంకేతికంగా క్లౌడ్ బరస్ట్ (మేఘ విస్ఫోటం)గా పేర్కొంటున్నారు. కేవలం రెండు మూడు గంటల వ్యవధిలో ఒకేసారి 15 నుంచి 25 సెంటీమీటర్ల వర్షం కురియడంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. వర్షాల కారణంగా నలుగురు నీటి వరదలో కొట్టుకుపోయి మృతి చెందారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్‌లో వర్షప్రభావానికి వరద నీటిలో కొట్టుకుపోయిన వ్యక్తి ఏకంగా ఎనభై కిలోమీటర్ల దూరంలో శవమై తేలడం ద్వారా వర్షాల ప్రభావం ఎంత అధికంగా ఉందో స్పష్టం అవుతోంది.

ఒకపక్క హైదరాబాద్ జనాభా పెరడటంతో పాటు కాలనీలు కూడా పెద్ద సంఖ్యలో ఏర్పడ్డాయి. దీనికి అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయకపోవడంతో సమస్యలు ఎదురౌతున్నాయి. ప్రధానంగా పూడికతీత పనులు సక్రమంగా జరగడం లేదు. నగరం మధ్యగా వెలుస్తున్న ఓపెన్ నాలాలు ఆక్రమణలకు గురికావడం కూడా ఒక ప్రధాన అవరోధంగా ఏర్పడింది. అక్రమ కట్టడాలను నిరోధించేందుకు ఏర్పడిన హైడ్రా రాజకీయ కోరల్లో చిక్కుకోవడంతో కొన్ని సమస్యలు ఏర్పడ్డాయి. నగరం మధ్యలో నుంచి ప్రవహిస్తున్న మూసీనది, ఓపెన్ నాలాలు ఆక్రమణల వల్ల కుదించుకుపోయాయి. ఈ ప్రాంతం మీదుగా నీరు ప్రవహించే అవకాశం లేకుండా పోయింది. సుమారు 15-20 సంవత్సరాల నుంచి ఆక్రమణలను తొలగించాలని ప్రయత్నాలు చేసినప్పటికీ రాజకీయ వత్తిడిల కారణంగా పనులు ముందుకు సాగలేదు. హైడ్రాను ఏర్పాటు చేసిన తరువాత కొన్ని చెరువులను అభివృద్ధి చేయగలిగారు. గతంలో నగరంలో కొన్ని ప్రాంతాలు మాత్రమే నీటి ముంపునకు గురయ్యేవి. ప్రస్తుతం అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. భారీ వర్షం కురిస్తే 70 శాతం కాలనీలు, ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. డ్రైనేజీలలో పూర్తి స్థాయిలో పూడికను తొలగించడమే కాకుండా దెబ్బతిన్న పైపులను తొలగించాల్సిన అవసరం ఉంది. బేగంపేట, పంజాగుట్ట, ఎంజె మార్కెట్, అంబర్‌పేట వంటి కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలను కొంత అభివృద్ధి చేశారు. అయితే కనీసం 400 కిలోమీటర్ల మేర డ్రెయిన్లను అభివృద్ధి పరచాల్సిన అవసరం ఉంది. ప్రతి సంవత్సరం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా నిధుల కొరత వల్ల కార్యరూపం దాల్చడం లేదు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 2020 అక్టోబర్‌లో సంభవించిన ఆకస్మిక వరదల సమయంలో ముంపునకు గురైన ముఖ్యమైన ప్రాంతాలను కవర్ చేస్తూ మొదటి దశలో రూ.858 కోట్ల వ్యయంతో ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. దీనికింద ప్రధాన డ్రెయిన్లను అభివృద్ధి చేయడం ద్వారా ముంపు సమస్యలకు చెక్ పెట్టాలని ప్రయత్నించారు. అయితే ఈ ప్రణాళికలు రికార్డులకే పరిమితమయ్యాయి. క్షేత్రస్థాయిలో అమలు చేయలేకపోయారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం నీటి ముంపు సమస్యను నివారించాలంటే డ్రైనేజీ వ్యవస్థను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాల్సి ఉంది.

జూబ్లీహిల్స్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు, హుస్సేన్ సాగర్ నుంచి గాంధీనగర్, నల్లకుంట మీదుగా నగర శివార్లకు ప్రవహించే కెనాల్స్‌ను చక్కదిద్దాలి. ముందుగా ఈ ప్రాంతంలో ఉన్న ఆక్రమణలను తొలగించాలి. తరువాత పూడికను పూర్తి స్థాయిలో తొలగించి, భవిష్యత్తులో ఆక్రమణలు జరగకుండా రిటైనింగ్ వాల్‌ను నిర్మించాలి. పరిసర ప్రాంత ప్రజలు చెత్తాచెదారాన్ని ఈ ప్రాంతంలో వేయకుండా ఫెన్సింగ్ నిర్మించి రక్షణ కల్పించాలి. కనీసం 2050 సంవత్సర వినియోగాన్ని, వర్షాల తీవ్రతను అంచనా వేసి అభివృద్ధి పూర్తి స్థాయిలో కార్యాచరణను చేపట్టాల్సి ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ




కవర్ స్టోరీ

**ఇలపావులూరి వెంకటేశ్వర్లు**

# నవరాత్రి నాయకి సకలశక్తి స్వరూపిణి

**భారతదేశంలో పాటించే ఆచార వ్యవహారాలు, దేవీ దేవతల రూపాలు, వారికి చేసే పూజలు పర్వదినాలు.. అన్నీ కూడా వ్యక్తి సమాజంలో సముచిత గౌరవం పొందుతూ, సంఘ నియమాలను పాటిస్తూ ఉన్నత ఆధ్యాత్మిక మార్గంలో పయనించడానికి ఉద్దేశించినవి కావడం విశేషం. వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు అన్నీ కూడా ఇదే విషయాన్ని ప్రముఖంగా పేర్కొన్నాయి.**

గమనించవలసిన మరో విషయం ఏమిటంటే భారత ఆరాధనలో ఎలాంటి లింగ, జీవి బేధం లేకపోవడం. ప్రకృతి మరియు పురుషుడు రెండూ సమానమే.

కాకపోతే కాలక్రమంలో ఆరాధనా విధానాలలో కొంత మార్పు చోటు చేసుకున్నది. అలా ఏర్పడినవే శైవం, వైష్ణవం, శాక్తేయం. శివారాధకులను 'శైవులు' అన్నారు. శ్రీ మహా విష్ణువును పూజించే వారిని 'వైష్ణవులు' అని పిలుస్తారు. చరాచర సృష్టికి మూలం ప్రకృతి స్వరూపిణి అయిన మహా ఆది పరాశక్తిని సేవించేవారిని 'శాక్తేయులు' అంటారు. పరాశక్తిని ఆరాధించడంలో మంత్రం, తంత్రం రెండు విధానాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. పూర్వం అమ్మవారి పూజలో జంతు బలులు చోటు చేసుకొనేవి. జగన్మాత కూడా ఉగ్రరూపంతో దర్శనమిచ్చేది. జగద్గురు శ్రీ శ్రీ శ్రీ ఆది శంకరులు విశేష క్షేత్రాలలో 'శ్రీచక్ర' స్థాపన చేసి అమ్మను శాంతింపచేశారు. అప్పటి నుండి జంతు బలులు కూడా నిలిచిపోయాయి.

సకల లోక పాలకురాలు, సర్వ జీవులకు జనని, ముగ్గురమ్మల మూలపుటమ్మ, ప్రకృతి స్వరూపిణి అయిన ఆదిపరాశక్తిని అనేక నామ రూపాలతో ఆరాధించడం శతాబ్దాలుగా జరుగుతున్నది.

ముల్లోక పూజ్యురాలైన అమ్మ యాభై ఒక్క శక్తి పీఠాలలో, అనేక పుణ్య తీర్థ క్షేత్రాలలో స్వయంవ్యక్తగా, ప్రతిష్ఠిత మూర్తిగా వెలసి ఉన్నారు. గ్రామ గ్రామాన గ్రామవాసులు సంరక్షించే శక్తిగా గ్రామదేవతగా పూజలు అందుకొంటున్నారు. మిగిలిన ఆరాధనా విధానాలలో మాదిరి అమ్మవారి సేవలలో కూడా అనేక విధి విధానాలు పాటించడం జరుగుతోంది. వాటిల్లో ముఖ్యమైనవి 'నవరాత్రులు'. శక్తిని మాతృ రూపంలో ఆరాధించాలని స్వయంగా సృష్టికర్త బ్రహ్మదేవుడు శ్రీ మార్కండేయ మహర్షికి చెప్పారని దేవీ భాగవతం తెలుపుతున్నది. సర్వ విజయాలకు మూలం అయిన శ్రీ దుర్గా దేవికి అత్యంత ప్రీతికరమైన నవరాత్రులలో వివిధ రూపాలలో, అలంకరణలతో ఏ విధంగా ఆరాధించాలి.. అన్నది కూడా దేవీ భాగవతం సవివరంగా తెలుపుతున్నది.

## నవరాత్రులు

పురాణాల ప్రకారం సర్వ విద్యాప్రదాయని, సమస్త జ్ఞానప్రదాత, సకల ఐశ్వర్యదాయని, సకలసృష్టి స్థితి లయకారిణి, పరబ్రహ్మ స్వరూపిణి అయిన పరాశక్తిని ధ్యానించి ఆరాధించే విధానాలలో నవరాత్రి ఉత్సవాల స్థానం ప్రత్యేకమైనది.

శ్రీ దుర్గాదేవికి సంవత్సరంలో అయిదు నవరాత్రులు జరుపుతారని పురాణాలు తెలియచేస్తున్నాయి. అవి 'వసంత నవరాత్రులు', 'మాఘ నవరాత్రులు', 'ఆషాడ నవరాత్రులు', 'పౌష్య నవరాత్రులు', 'శరన్నవరాత్రులు'. సంవత్సరంలో వచ్చే వసంత, గ్రీష్మ, వర్ష, హేమంత, శిశిర, శరదృతువుల సమయంలో ఏర్పడే వాతావరణ మార్పులు ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా కొన్ని శరీర పరిశుభ్రత, ఆహార నియమాలను పాటిస్తూ ప్రకృతి రూపమైన పరాశక్తిని సేవించుకోవడమే ఈ నవరాత్రుల ప్రధాన ఉద్దేశం.

పంచ నవరాత్రులలో మనందరికీ బాగా పరిచయమైనవి జనవరిలో జరిపే వసంత నవరాత్రులు, ఆశ్వయుజ మాసంలో నిర్వహించే 'శరన్నవరాత్రులు'.

## శరన్నవరాత్రులు



'దశహర' గా పిలవబడిన 'దసర' పది రోజుల పర్వదినం. ఆశ్వయుజ మాస పాడ్యమి తిథి నుండి దశమి వరకు శరన్నవరాత్రులను అన్ని దేవీ ఆలయాలలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. రోజుకొక అలంకరణతో కొలువైన ముల్లోకపావనిని ఆరాధిస్తారు. భారతదేశంలోని అన్ని దేవీ, శైవ క్షేత్రాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దబడుతాయి. కొత్త కాంతులు వెల్లివిరుస్తాయి.

దసరా పర్వదినం వెనుక ఉన్న పురాణ గాథ తొలియుగం నాటిది. వర గర్వంతో అందరిని పీడించే అసుర సంహారంతో సమస్త లోకాలకు ఆనందాన్ని పంచిన సమయంలో జరుపుకొనేదే 'దశహర'.

## పూర్వగాథ

అనేక సంవత్సరాలు తపస్సు చేసి విధాతను మెప్పించి 'మరణం సంభవించకూడదు' అన్న వరం కోరాడట మహిషాసురుడు. పుట్టినవాడు గిట్టక తప్పదు కనుక అలాంటి వరం ఇవ్వడం సంభవం కాదన్నాడు సృష్టికర్త. అహంకారంతో స్త్రీ శక్తిని అంచనా వేయలేక అబలగా తలచి పురుషుల వలన మరణం రాకూడదు అన్న వరం పొందాడట. వర గర్వంతో లోకాలను పీడించసాగాడట.

దేవతలు, మునులు, ప్రజలు మహిషాసురుని దుశ్చర్యల నుండి కాపాడమని త్రిమూర్తులను ప్రార్థించారు. త్రిమూర్తుల తేజస్సు నుండి పదహారు చేతులలో రకరకాల ఆయుధాలు ధరించి ఉద్భవించిన ఉగ్రరూపమే 'శ్రీ మహిసాసుర మర్దిని'. తొమ్మిది రోజుల భీకర యుద్ధం జరిగిందట. పదవ రోజున అమ్మవారు రాక్షస సంహారం చేసి శ్రీ విజయ దుర్గగా అవతరించారు.



అసుర అస్తమయంతో లోకాలలో నూతన కాంతులు నెలకొన్నాయి. సర్వప్రాణికోటి సంతోషంతో శ్రీ దుర్గాదేవిని ఈ పది రోజులు వివిధ రూపాలలో అలంకరించి ఆరాధించడం ఆరంభమైనది.

మరో కథనం ప్రకారం రామరావణ యుద్ధంలో శ్రీ రామచంద్ర మూర్తి చేతిలో రావణాసురుడు హతమైనది కూడా ఈ విజయదశమి నాడే అని తెలుస్తోంది. ఈ కారణంగా ఉత్తరాదిన 'రావణ దహనం' పేరిట దశ కంఠుని గడ్డి బొమ్మలను విజయ దశమినాడు దహనం చేస్తారు.

## దశ విధ రూపాలు

మహా సరస్వతి, మహాలక్ష్మి, మహా కాళిలు ముగురమ్మలు. వారి ఏక స్వరూపమైన ఆదిశక్తిని నవరాత్రులలో తొలి మూడు రోజులు పార్వతీ స్వరూపంగా, తరువాతి మూడు రోజులు శ్రీ మహాలక్ష్మి అవతారంగా, చివరి మూడు రోజులు శ్రీ సరస్వతి ప్రతిరూపంగా ఆరాధిస్తారు. దశ రూపంలో ఆరాధించబడే శ్రీ దుర్గా దేవి వరదాయనిగా ప్రసిద్ధి.

దేవీ భాగవతం ప్రకారం అమ్మవారిని నవరాత్రులలో పది రూపాలలో ఆరాధించాలి. అవి "శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కంధ మాత, కాత్యాయని, కాళరాత్రి, మహా గౌరీ, సిద్ధి ధాత్రీ, విజయదుర్గ". కానీ అలంకరణ మాత్రం అవతార రూపానికి ప్రతిగా ఉంటాయి.

ఆయా అలంకరణలు స్థానిక ఆచారాలను అనుసరించి చేస్తుంటారు. ఎక్కువ మంది విజయవాడ ఇంద్రకీలాద్రి మీద కొలువైన శ్రీ కనకదుర్గా దేవి ఆలయంలో నిర్వహించే అలంకరణలు అనుసరిస్తుంటారు. ప్రతి సంవత్సరం అమ్మవారిని శ్రీ బాలా త్రిపుర సుందరి, శ్రీ గాయత్రీదేవి. శ్రీ అన్నపూర్ణ, శ్రీ మహాలక్ష్మి, శ్రీ లలిత త్రిపుర సుందరి, మహా చండిదేవి, శ్రీ సరస్వతి, శ్రీ దుర్గాదేవి. మహిషాసుర మర్దని, శ్రీ రాజరాజేశ్వరీ దేవి రూపాలలో అలంకరిస్తారు. కానీ ఈ సంవత్సరం తదియ తిథి అధికంగా రావడం వలన నాల్గవ రోజున అమ్మవారిని ప్రత్యేకంగా శ్రీ కాత్యాయని దేవి రూపంలో అలంకరించడం విశేషం.

## శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి

దుర్గా శరన్నవరాత్రులు ఆశ్వయుజ మాస పాడ్యమి నాడు ప్రారంభం అవుతాయి. తొలినాటి అవతార రూపం 'శైల పుత్రి'. పర్వతరాజు 'హిమవంతు'ని కుమార్తె కనుక శైల పుత్రి అని పిలుస్తారు. సతీ దేవి అంశం అయిన శైలపుత్రి శిరస్సున చంద్రరేఖను ధరించి, త్రిశూలాన్ని, కమలాన్ని చేతబూని వృషభ వాహనం మీద ఉపస్థితురాలై దర్శనమిస్తారు. శైలపుత్రి కుండలినికి ప్రతిరూపం. మూలాధార చక్రానికి అధిష్టాన దేవత. మనుష్యులలో నిద్రాణంగా ఉన్న కుండలిని శక్తిని మేల్కొలుపుతుంది. ఆధ్యాత్మిక ప్రయాణానికి నాంది పలుకుతుందని చెబుతారు. పర్వత రాజపుత్రి ప్రకృతికి ప్రతిరూపం.

భక్తజన మనోభీష్టాలను నెరవేర్చే ఆమెను ఆరాధించడం వలన ఉపాసన సిద్ధిస్తుంది అని చెబుతారు. అమ్మవారిని 'శ్రీ బాలా త్రిపుర సుందరి'గా అలంకరిస్తారు. బ్రహ్మాండ పురాణంలో సోదాహరంగా శ్రీ బాలా త్రిపుర సుందరి అవతార తత్త్వం గురించి వివరించబడినది. సత్వ, రజ, తమో గుణాలకు మూలమైన మనస్సు, బుద్ధి, చిత్తం లేదా అహంకారం మూడు త్రిపుర సుందరి దేవి అధీనంలో ఉంటాయి. త్రిపురుడైన ఈశ్వరుని భార్యను గౌరి అని కూడా అంటారు. అభయ ముద్రలో జపమాల ధరించిన బాలా త్రిపురసుందరిని పసుపు వస్త్రాలు ధరించి, పూజించి నేతితో చేసిన పాయసాన్ని నివేదిస్తే మానసిక శాంతి లభిస్తుంది అన్నది పురాణ వాక్యం.



## శ్రీ గాయత్రీ దేవి

శరన్నవరాత్రులలో రెండవ రోజు పూజలు అందుకొనే దేవి 'బ్రహ్మచారిణి'. పరమశివుని పతిగా పొందాలన్న దీక్ష వహించిన బ్రహ్మచారిణి. ఈమెను 'అపర్ణ' అని కూడా పిలుస్తారు. మహేశ్వరుని పొందటానికి ఆకులు కూడా స్వీకరించని అపర్ణ. బ్రహ్మచారిణి అన్న పదానికి "అన్నీ తెలిసి కూడా ఒక పనిలో ఏకాగ్రతతో నిమగ్నం అవ్వడం" అని అర్థం చెబుతారు. సర్వం తెలిసిన బ్రహ్మస్వరూపిణి ముక్కంటి గురించి తపస్సు చేయడం అలాంటిదే.



జపమాల, కమండలం ధరించి శ్వేతవస్త్ర ధారిణిగా దర్శనమిచ్చే బ్రహ్మచారిణి ఏకాగ్రతకు ప్రతిరూపం. ఏకాగ్ర చిత్తంతో సాధన చేసేవారికి సొంతం కానిది ఏముంటుంది?

పాడ్యమి రోజున అమ్మవారిని సకల శక్తులకు మూలమైన శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో తీర్చిదిద్దుతారు. చతుర్వేద రూపమైన శ్రీ గాయత్రీ దేవి జ్ఞాన తేజస్సు వెలువరించే పంచ ముఖాలతో శంఖం, గద, చక్రం, అంకుశం ధరించి శోభాయమాన అలంకరణలో దర్శనమిస్తారు. కనకాంబర వర్ణ వస్త్రాలు ధరించి శక్తిమేర గాయత్రీ మంత్రం జపం చేసి, వడపప్పు, పానకం, చలిమిడి, అల్లపు గారెలు నివేదన చేయడం వలన జ్ఞానాభివృద్ధి కలుగుతుంది.. అని చెబుతారు.

## శ్రీ అన్నపూర్ణ దేవి

నవరాత్రులలో మూడవ రోజైన తదియనాడు కళ్యాణ కారకమైన 'చంద్ర ఘంటా దేవి' అవతారంలో పూజించబడతారు. వెన్నెలరేడు చంద్రుని చంద్రికలా ప్రకాశించే గంట ఆకారంలో ఉండే అర్ధచంద్ర ధరించడం వలన అమ్మవారిని 'చంద్ర ఘంటా దేవి' అని పిలుస్తారు.

కుజ గ్రహ నివారిణి. కుంకుమ, ఎఱ్ఱని కలువ, మందార పూలతో పూజ చేయడం, ఎఱ్ఱని పండ్ల నివేదన వలన కుజగ్రహ దోష నివారణ కలుగుతుంది అని అంటారు. శరణు కోరిన వారి ఆత్మస్థైర్యాన్ని, నిర్భయతను పెంపొందించే దేవతగా ప్రసిద్ధి. శ్మశానవాసి శివుని వివాహమాడిన చంద్ర ఘంటా దేవి శ్రీ అన్నపూర్ణా దేవి అలంకరణలో దర్శనమిస్తారు.

ఆది భిక్షువుని పతిగా పొంది ఆహారాన్ని అందించిన దేవి శ్రీ అన్నపూర్ణ. అన్నం పరబ్రహ్మ స్వరూపం. సర్వజీవుల మనుగడకు అత్యవసరం ఆహారం.

ఎడమ చేతిలో అన్నపాత్ర, కుడి చేతిలో వడ్డిస్తున్న గరిటె, ఎదురుగా బిక్ష స్వీకరిస్తున్న భిక్షపతి. ఈ అలంకరణలో దర్శనమిచ్చే శ్రీ అన్నపూర్ణను గంధపు వర్ణ వస్త్రాలు ధరించి షోడశ పూజ చేసి ధద్యోజనం, కట్టెపొంగలి నివేదన చేసిన వారికి అన్నపానీయాలకు లోటు ఉండదు. వంశాభివృద్ధి జరుగుతుంది.

## శ్రీ కాత్యాయని దేవి

చవితి తిథి వచ్చే నాలుగవ రోజున అమ్మవారు 'కూష్మాండదేవి' రూపంలో పూజించబడతారు. తన శక్తితో విశ్వాన్ని సృష్టించిన సృష్టికర్త. కూష్మాండం అంటే అండం అని అర్థం. బూడిదగుమ్మడి అని అర్థం కూడా ఉన్నది. సూర్య తేజస్సుతో అష్ట భుజాలతో అపూర్వ కాంతులతో శోభిల్లే కూష్మాండదేవి భక్తుల మానసిక, శారీరక అనారోగ్యాన్ని తొలగిస్తుంది.



ఈ సంవత్సరం అధిక తిథి తదియ రావడం వల్ల తొలిసారి నవరాత్రులను పదకొండు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుంది. అందువల్ల మొట్టమొదటిసారిగా చవితి తిథినాడు సకల విజయాలకు ప్రతీక అయిన 'శ్రీ కాత్యాయని దేవి'గా అమ్మవారు దర్శనమిస్తారు. 'కాత్యాయన మహర్షి' మానస పుత్రిక, మహిషాసుర సంహారిణి శ్రీ కాత్యాయని దేవి. దుష్టనాశనిగా ప్రసిద్ధి. సింహవాహనం అధిరోహించి కనపడే దేవి ధైర్యానికి, విజయానికి ప్రతీక. గురుగ్రహ అధిపతి. అమ్మవారి ఆరాధన గురుగ్రహ దోషాన్ని తొలగిస్తుంది అని అంటారు. జీవితంలో ఉన్నత స్థానాన్ని పొందగలరు అని విశ్వసిస్తారు. ఆకుపచ్చని వస్త్రాలను ధరించి సూర్యోదయానికి ముందే అమ్మవారిని పూజించి తేనె, నేతికేసరి, ధద్యోజనం నివేదన సమర్పించడం వల్ల సకల మనోభీష్టాలను నెరవేరుస్తుంది అన్నది పురాణ వాక్యం.



## శ్రీ మహాలక్ష్మి దేవి

నవరాత్రులలో చతుర్భుజాలలో కమల పుష్పాలు ధరించి అభయ వరద హస్తాలతో గజరాజుతో శ్రీ మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తారు. ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన వరాలను ప్రసాదించే శ్రీ మహాలక్ష్మిని ఆకుపచ్చని వస్త్రాలు కనకధారాస్తవం లాంటి స్తోత్రాలు పఠించి బెల్లంతో చేసిన క్షీరాన్నం నివేదన సమర్పించాలి. శ్రీ మహాలక్ష్మిని ఆరాధిస్తే అష్టైశ్వర్యాలు, సమస్త సౌభాగ్యాలు ప్రసాదిస్తుంది అన్నది భక్తుల విశ్వాసం.

## శ్రీ లలిత త్రిపురసుందరి దేవి

లోకకంటకుడైన తారకాసురుని సంహరించడానికి శివపార్వతుల పుత్రునిగా అవతరించినవాడు 'స్కందుడు'. శ్రీ కుమారస్వామి, శ్రీ సుబ్రహ్మణ్య స్వామి అని కూడా పిలుస్తారు. దేవసేనాని అయిన షణ్ముఖునికి జన్మనిచ్చిన జనని స్కందమాత శ్రీ దుర్గాదేవి. సింహాసనం మీద ఉపస్థితురాలై కలువపూలను పట్టుకొని అభయ ముద్రతో ఒడిలో బాలుడైన స్కందుని లాలిస్తున్న అవతార రూపం నవరాత్రులలో పూజించవలసిన శ్రీ స్కందమాత. లోకాల క్షేమం కాంక్షించే జనని శ్రీ స్కందమాత. భక్తుల జీవితాలలో సుఖసంతోషాలను, ఆయురారోగ్యాలను ప్రసాదించే తల్లి. అయిదవ రోజున స్కందమాత శ్రీ లలిత త్రిపురసుందరి అలంకరణలో దర్శనమిస్తారు. శ్రీచక్ర అధిష్టాన దేవత పాశం, అంకుశం, చెఱకువిల్లు, పూలబాణాలతో





దివ్య మనోహర రూపంతో కొలువవుతారు సౌభాగ్య ప్రదాయని. దీర్ఘాయువు, సత్సంతానం, వంశాభివృద్ధి సకల పాప హరణం అమ్మవారి దర్శనం. ఎఱ్ఱని వస్త్రాలు ధరించి శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేయడం, ఖడ్గమాల పూజ చేయించుకోవడం ఉత్తమం. నివేదన కింద గారెలు, ధద్యోజనం సమర్పిస్తారు.

## మహాచండి దేవి

శ్రీ మహాచండి దేవి అలంకారం దేవీ ఆరాధనలో అత్యంత శక్తివంతమైన పవిత్రమైనది. లోకంలో ధర్మాన్ని నిలబెట్టడానికి అధర్మ వర్తనులైన అసురులను సంహరించినది. మహాశక్తి స్వరూపిణి అయిన మహాచండి దేవి పూజ శుభ ఫలితాలను అందిస్తుంది. త్రిమూర్తుల శక్తితో ఉద్భవించిన దేవి పట్ల పరిపూర్ణ భక్తివిశ్వాసాలు కలిగివున్న బక్తులకు సంపదలు, ఆరోగ్యం, శాంతి, కీర్తి ప్రసాదిస్తుంది అని చెబుతారు. బంగారు వర్ణ ధరించి చండీ సప్తశతి పాటిస్తూ పసుపుపూలతో అర్చించి కట్టెపొంగలి నివేదన చేసినవారికి అమ్మ ఆశీర్వాదాలు నిరంతరం ఉంటాయి.

## శ్రీ మహాసరస్వతి దేవి

దసరా నవరాత్రులలో ఏడవ రోజున మూలా నక్షత్రం ఉన్న సప్తమినాడు శ్రీ కాళరాత్రిదేవి రూపానికి సర్వ విద్యలకు మూలమైన శ్రీ మహాసరస్వతి దేవి అలంకరణ చేస్తారు. కాళరాత్రి అంటే అజ్ఞానంతో మూర్ఖత్వంతో జరిగే వ్యక్తిత్వ హననం నుండి కాపాడేది అని అర్థం. అహంకారి, జ్ఞానశూన్యుడు ఎలా వృధా చేసుకుంటాడో తెలిసిన విషయమే. ఈమె ఆరాధన జ్ఞానాన్ని ప్రసాదించడమే కాకుండా సకల శుభాలను కలిగిస్తుంది. విద్యలకు నిలయం శ్రీ సరస్వతి దేవి. విద్య అజ్ఞానాన్ని దూరం చేస్తుంది. పరిపూర్ణ జీవిత గమ్యం పట్ల సక్రమమైన మార్గనిర్దేశకత్వం అందిస్తుంది. బ్రహ్మ చైతన్య రూపిణి శాశ్వత పద్మం మీద దండ కమండలాలు, అక్షరమాల, వీణ ధరించి ఉపస్థిత భంగిమలో దర్శనమిస్తారు. తెల్లని వస్త్రాలు ధరించి చదువుల తల్లిని ఆరాధించి అల్లపు గారెలు, పరమాన్నం నివేదన చేస్తే సకల విద్యలలో రాణిస్తారు.



## శ్రీ దుర్గాదేవి

జీవితంలో జాతకరీత్యా, గ్రహచార ప్రభావం లేదా స్వయంకృతంతో సంభవించిన దుర్గతులను తొలగించే అలంకార స్వరూపం శ్రీ దుర్గాదేవి. శరన్నవరాత్రులలో నవ విధ రూపాల్లో పూజలందుకొంటున్న అమ్మవారు ప్రత్యేకంగా భక్తులను పరిరక్షించడానికి కొలువైన దివ్య మంగళ రూపం శ్రీ దుర్గాదేవి. లోకకంటకుడైన దుర్గమాసురుని సంహరించి లోకాలను రక్షించిన దేవి శ్రీ దుర్గ. అమ్మ దర్శనం సకల దుర్గతుల నుండి కాపాడుతుందని పెద్దల మాట. ఎఱ్ఱని అక్షతలు, పూలతో పూజించాలని అంటారు.



## శ్రీ మహిషాసుర మర్దని

బలవంతుడు, వరగర్వం మూర్తీభవించిన అసురునితో తొమ్మిది రోజులు అవిశ్రాంత పోరు, అసుర సంహారం తరువాత కూడా అమ్మవారిలో ఉగ్రత్వాన్ని తగ్గించలేదు. పది హస్తాలలో అనేక ఆయుధాలు, పాదాల వద్ద మరణించిన అసురుడు. అమ్మవారు సింహవాహనం మీద లోక సంరక్షురాలిగా దర్శనం ప్రసాదిస్తారు. అమ్మవారి దర్శనం సకల భయాలను తొలగిస్తుందని చెబుతారు.

## శ్రీ రాజరాజేశ్వరీ దేవి

సకల భువన భాండాలకు పూజ్యనీయురాలు. నవ దుర్గా రూపాలలో పూజలు అందుకొనే 'అపరాజిత'. అపరాజిత అంటే అపజయం ఎరుగనిది అని అర్థం. దసరా ఉత్సవాలలో విజయదశమినాడు అమ్మవారిని శ్రీ విజయదుర్గ/శ్రీ అపరాజిత దేవి రూపంలో ప్రత్యేకంగా పూజిస్తారు.



## విజయదశమి

విజయ దశమి నాడు ఆయుధ పూజ, శమీ పూజ, సీమ ఉల్లంఘనకు అదే విధంగా శ్రీ అపరాజిత దేవి ఆరాధనకు ప్రత్యేక ప్రాధాన్యత ఉన్నది. పన్నెండు సంవత్సరాల అరణ్యవాసం అనంతరం ఒక సంవత్సర అజ్ఞాత వాసం చేయడానికి ముందు పాండవులు తమ ఆయుధాలను శమీ వృక్షం మీద అదృశ్య రూపంలో నిక్షిప్తం చేశారు. తిరిగి వాటిని అర్జునుడు ఉత్తర గోగ్రహణం రోజున వెలికి తీసి కౌరవ సేనను ఓడించడం జరిగింది. ఆరోజు విజయ దశమి. అందువలన ప్రజలు విజయదశమి నాడు ఆయుధ పూజ చేస్తారు. అంటే సమాజ కట్టుబాట్ల మేరకు మన వృత్తి పరికరాలు, మోటారు వాహన పూజ తప్పనిసరిగా చేస్తారు. కొన్ని గ్రామాలలో సాయంత్రం సమయంలో గ్రామ ఈశాన్య దిశలో పొలిమేరలు దాటి తిరిగి రావడం కనపడుతుంది.

## దసరా ఉత్సవాలు

సకలలోక జనని శ్రీ దుర్గ దేవితో ముడిపడి ఉన్న దసరా పర్వదినాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాల వారు భక్తిశ్రద్ధలతో ఘనంగా చేస్తారు. ముఖ్యంగా తూర్పు రాష్ట్రాలైన ఒడిశా, బెంగాల్, బీహార్‌లతో పాటు ఈశాన్య రాష్ట్రాలలో అత్యంత ఘనంగా వీధికి ఒక మండపంలో సర్వాభరణ భూషితురాలైన అమ్మను ప్రతిష్టించి నవరాత్రులు పూజించి చివరి రోజున నిమజ్జనం చేస్తారు. నవరాత్రులలో ఈ రాష్ట్రాలలో ప్రత్యేకమైన ఆధ్యాత్మిక శోభ నెలకొంటుంది. గుజరాత్, మహారాష్ట్రలో గీత నృత్యాలతో నవరాత్రులను అందరు కలిసికట్టుగా భక్తితో జరుపుకొంటారు. గుజరాతీల 'గర్బ' కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఆకర్షణ ఉన్నది. దక్షిణాది రాష్ట్రాలలో ఆలయాలలో నవ విధ దుర్గలను విశేషంగా అర్చనలు, అలంకరణలు, ఆరగింపులతో ఆరాధించడం కనపడుతుంది.

## శమీపూజ

సాక్షాత్తూ అపరాజితాదేవి కొలువై వున్న వృక్షం శమీవృక్షం. తండ్రిమాటకోసం అరణ్యానికి వెళుతున్న శ్రీరాముడికి జమ్మిచెట్టు నీడను ఇచ్చిందని అంటారు.

'శమీ శమయతే పాపం, శమీ శత్రు వినాశనం అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియ దర్శనం' అనేదానిని బట్టి ఈ ఇరువురికీ శమీవృక్ష పూజకూ సంబంధం వున్నట్లు తెలుస్తుంది.

పాండవులు పన్నెండు యేళ్ల అరణ్యవాసం పూర్తి చేసుకుని అజ్ఞాత వాసంలోకి వెళ్లటానికి ముందు తమ దివ్య ఆయుధాలను జమ్మిచెట్టుపై మరుగున వుంచి, అజ్ఞాతవాసం సంవత్సర కాలం పూర్తి కాగానే తిరిగివచ్చి వారి ఆయుధాలను తీసుకొంటారు.

శమీవృక్షం రూపంలో వున్న అపరాజితాదేవి తనను ఆరాధించినవారికి సదా విజయాలను చేకూరుస్తుందని భక్తుల విశ్వాసం. విజయదశమినాడు జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేస్తారు. విజయదశమిరోజున జమ్మి ఆకులను పెద్దవారికి ఇచ్చి వారి ఆశీస్సులను పొందుతారు.



# బతుకమ్మ..బతుకమ్మ ఉయ్యాలో

దేశం మొత్తం దసరా ఉత్సవాలను జరుపుకునే పావన సమయంలో తెలంగాణ మహిళలు ఉత్సాహంతో పాల్గొనేవి బతుకమ్మ సంబరాలు. తెలంగాణ రాష్ట్ర పర్వదినం బతుకమ్మ. భాద్రపద మాస అమావాస్య నాడు ఆరంభం అయ్యే బతుకమ్మ సంబరాలు తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. వర్షాకాలం పూర్తి అయ్యి చలికాలం ప్రారంభ సమయం. పరిసరాలన్నీ పచ్చదనం సంతరించుకొని ఆహ్లాదకర వాతావరణం నెలకొని ఉంటుంది. పూలు బతుకమ్మ అలంకరణలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. తెలంగాణ ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ వారి జీవితాలతో మమేకమైంది. బతుకమ్మ పాటలలో విషాదంతో పాటు, ప్రజలు సంఘటితం కావలసిన అవసరం గురించి మర్మగర్భంగా తెలుపుతాయి. బతుకమ్మ పాటలలో చక్కని లలిత లలిత పదాలను పేర్చి పెట్టారు. విశిష్టమైన ఒక జాతి మనుగడ గురించి, ఆ ప్రాంత ప్రాధాన్యత, అభివృద్ధి గురించి చేసుకొనే ప్రత్యేక పర్వం బతుకమ్మ.

## చారిత్రక గాథ

వెయ్యి సంవత్సరాల క్రితం ఈ ప్రాంతాన్ని బలవంతులైన రాష్ట్రకూట రాజులు పరిపాలించేవారు. నాడు నేటి తమిళనాడు ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని దక్షిణ పథంలో అధిక భాగాన్ని పాలించేవారు చోళులు. సుందర చోళుని కాలంలో ఎన్ని ప్రయత్నాలు చేసినా రాష్ట్రకూటులను ఓడించలేకపోయారు. చివరికి రాష్ట్రకూటుల సామంతులైన చాళుక్యుల సహకారంతో చోళరాజు విజయం సాధించారట. నాటికే ప్రముఖ పుణ్యక్షేత్రం అయిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి లింగ సౌందర్యం అపురూపం. శివభక్తులైన చోళులు ఆ లింగాన్ని తమ రాజధాని తంజావూరుకి తీసుకొని వెళ్లారట.స్వామివారి మీద నెలకొన్న భక్తి విశ్వాసాలతో కుమారునికి రాజరాజ చోళుడు అన్న పేరు పెట్టారు. ఆది దంపతులు అర్ధనారీశ్వర రూపులు. స్వామి లేని పార్వతి విచారాన్ని, తమ వారసత్వ సంపద దోచుకెళ్లడం వల్ల కలిగిన ఆవేదనను మేరువులాగా పూలను పేర్చి పాలకులకు తెలిపారు. బతుకమ్మ అసలు పేరు బృహదమ్మ(రాజరాజేశ్వరిదేవి/పార్వతి). కాలక్రమంలో బతుకమ్మగా మారిందని అంటారు. జలకళతో నదులు, సరస్సులు, విరబూసిన పూలతో మొక్కలతో ప్రకృతిని ఆరాధించే పండుగగా బతుకమ్మ ప్రసిద్ధి గాంచింది.



మరో కథనం ప్రకారం స్థానిక పాలేగాళ్లు, నవాబులు, జమీందారులు, పెత్తందారుల దొరతనంతో ఇక్కట్లు పడ్డ తెలంగాణా మహిళల పరిస్థితి దారుణంగా ఉండేది. సర్దుకుపోతూ జీవచ్ఛవాలలాగా బతుకున్న వారిని ఓదార్చుతూ అకృత్యాలను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొన్న వారిని తలచుకొంటూ బాధను దిగమింగుకొని వారి జ్ఞాపకంగా పూలను త్రికోణాకారంగా పేర్చి వారి జ్ఞాపకంగా బతుకు అమ్మా.. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అని పాటలు పాడుతారు.

భాద్రపద అమావాస్యనాడు ప్రారంభమయ్యే సంబరాలు తొమ్మిది రోజులు జరుగుతాయి. ప్రతిరోజు ఒక ఇత్తడి/రాగి పళ్లెంలో రకరకాల రక రకాల పూలను క్రమం పద్ధతిలో పేరుస్తారు. ముఖ్యంగా బంతి, చామంతి, నందివర్ధనం, తంగేడు, గునుగుపూలను సుందరంగా పేర్చి మధ్యలో పసుపు గౌరమ్మను ఉంచుతారు. రంగవల్లి మధ్యలో పూల బతుకమ్మను ఉంచి చప్పట్లు కొడుతూ, చుట్టూ తిరుగుతూ ప్రకృతిని కీర్తిస్తూ బతుకమ్మ పాటలను పాడుతారు. తొమ్మిది రోజుల పాటు జరిగే సంబరాలలో బతుకమ్మకు రోజుకొక్క నివేదన సమర్పిస్తారు.

భాద్రపద అమావాస్యను తెలంగాణలో పెత్రామస అంటారు. **మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ:** నువ్వులు, బియ్యప్పిండి కలిపిన ప్రసాదాన్ని నివేదిస్తారు. **రెండవ రోజు అటుకుల బతుకమ్మ:** సప్పిడి పప్పు, బెల్లం, అటుకుల మిశ్రమతో చేసిన నైవేద్యం సమర్పిస్తారు. **మూడవ రోజు ముద్దపప్పు బతుకమ్మ:** మూడవ రోజు అమ్మవారు పాలు, బెల్లం, ముద్దపప్పు నివేదన ఇష్టంగా అందుకొంటారు.

**నాల్గవ రోజు నానేబియ్యం బతుకమ్మ:** తదియనాడు కొలువైన అమ్మవారికి పాలు, బెల్లంతో నానేసిన బియ్యం కలిపి నైవేద్యంగా సమర్పిస్తారు. **ఐదవ రోజు అట్ల బతుకమ్మ:** అట్లను ఇష్టంగా ఆరగించేది అట్ల బతుకమ్మ. **ఆరవ రోజు అలిగిన బతుకమ్మ:** తనకు పుట్టింట సరైన రీతిలో మర్యాదలు జరగడం లేదని అలక పాన్పు ఎక్కుతుంది. ఆరోజు ఏ నివేదన వుండదు. **ఏడవ రోజు వేపకాయల బతుకమ్మ:** ఇంటి ఆడబిడ్డను బతిమాలి, బుజ్జగించి బియ్యప్పిండిని నేతిలో వేయించి వేపకాయల మాదిరి చేసి నివేదిస్తారు. **ఎనిమిదవ రోజు వెన్నముద్దల బతుకమ్మ:** ఎనిమిద రోజున బతుకమ్మకు నువ్వులు, వెన్న, నెయ్యి, బెల్లంతో చేసిన ఉండలను నివేదన చేస్తారు.

**తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మ:** బతుకమ్మ సంబరాలలో దుర్గాష్టమినాడు చేసేది సద్దుల బతుకమ్మ. తంగేడు, గునుగు, బీర, గుమ్మడి, చామంతి, బంతిపూలతో బతుకమ్మలను సృజనాత్మకతతో అత్యంత సుందరంగా పేరుస్తారు. బంధు మిత్రులు, ఇరుగు-పొరుగు వారితో కలిసి ఆడి- పాడి, బతుకమ్మను సాగనంపే పాటలు పాడుతూ చెరువుల్లో నిమజ్జనం చేస్తారు.ముత్తయిదువలు వాయనాలు ఇచ్చి పుచ్చుకొంటారు. తాము తెచ్చిన ప్రసాదాలు అందరూ ఇచ్చి, పుచ్చుకుంటారు. బతుకమ్మను స్మరిస్తూ తిరిగి ఇళ్లకు చేరుకుంటారు.

# ఒక అనుమానం

శరీరం వెళ్లిపోతోంది
పొద్దున్నే వెండిమేఘంలా మెరిసిన ముఖం,
ముఖం మీద
చారలు చారలుగా సాగిన వెన్నెల
జాడలేకుండా పోయింది.
పగిలిన గాజుపెంకులాంటి కన్నులను
మూటలుగా చేసి
వాకిలికి వేలాడదీసాం.
సజీవంగా వెళ్లిన కొండ తిరిగిరాదని తెలుసు
కనీసం నిర్జీవమైన, గడ్డ కట్టిన, ఆరిపోయిన,
తూట్లు పొడవబడిన చివరి మెరుపు కోసం
గొంతుల వేదన.

ఈ వారం కవిత్వం

కాస్త మట్టిని తవ్వుకొని
శరీరాన్ని దాచుకునే అవకాశం ఇవ్వండి!
దోసిళ్ళతో గుప్పెడు మట్టిని తీసుకొని
మహోన్నతమైన శిఖరమై చల్లనివ్వండి.
గుండెల్లో నీళ్లు గునపంలా దిగి
విశాలమైన చెరువు ఏర్పడిన తర్వాత
ఊపిరి చేయి దాటిపోతుంది.
చెరువు తవ్వింది ఎవరు?
చెరువులోకి ఆఖరి ఘడియలు చల్లింది ఎవరు?
ఒక అనుమానం
నిర్మానుష్యంగా మారిన చోట మరణం.
ఇప్పుడు కొండను,
కొండతో పాటు జ్ఞాపకాలను
యదలోతుల్లో పదిలపరచుకోవాలి

– జాని తక్కెడశిల

# ఏకాంతమే ఆత్మకి ఆహారం

రణగొణ ధ్వనుల మధ్య,
ఆత్మ ఆకలితో అలమటిస్తుంది.
పెదవి పలకని మాటలు,
గుండె పలకని రాగాలు
ఏకాంతంలోనే పుడతాయి.

ఏకాంత నడకలో,
మనసు తనతోనే భాషిస్తుంది.
గతాన్ని రాసి, భవిష్యత్తును
చదువుతుంది,
ఆలోచనల ప్రవాహంలో
పొంగిపోతుంది.

జనం చుట్టూరా ఉన్నా,
ఆత్మ తృప్తి చెందదు
ఏకాంతాన్నే ఆహారంగా
నెమ్మదిగా తింటుంది.

– బాలాజీ పోతుల





# ఎవరీ సుందరి?

ఉడికించి కరిగించే ఒయ్యారి
ఎవరీ సుందరి..!
మదన మనోహర మందస్మిత
నయన చకోరి
నింగి వంగి తొంగిచూసే నీలి
మబ్బుల నీడలో
పురివిప్పి నాట్యం చేసే మయూరి
సిగలో సిరిమల్లెలు
చక్కని చుక్కలను
మరపించే వన్నెచిన్నెలు
కళ్ళు తళుకులీను గనుల
మణులు
అణువణువున ఒంపులు సొంపులు
ఒలికించి మత్తు చిలికించే
హొయలు
కవ్వించే కన్నెవయసు ఊరించే
సొగసు
కలహించే వన్నెలాడి వలలో
వేసిన మాయ లేడి
నవ్వించే పువ్వు దోర వలపులు రువ్వు
వెండి వెన్నెలలో
సరసమాడే కలువ లవ్వు
నా కలలోని కళవు
ఇలలో వెలసిన నువ్వు

– పూసాల సత్యనారాయణ

# కొత్తదనాలు

కొన్ని పాద ముద్రలు..
ఆదర్శ చరిత్ర
ఆనవాళ్ళుగా నిలిచిపోతాయి
పుట్టుక మొదలు గిట్టే వరకూ
ఆటుపోటుల సంద్రంలో
ఈదులాడక తప్పదు
బాధలు ఎప్పుడూ
వందశాతం గ్రంథస్థం కావు
దృశ్యాలను చూసే కళ్ళు
మనసును తోడుక్కున్నప్పుడే
స్వప్నాలు శిథిలమవ్వటం కనిపిస్తాయి
భౌతికంగానో..మానసికంగానో
గాయపడ్డ ప్రాణాలు
తెరిపిన పడాలంటే..
అనివార్యంగా మరుపు లేపనాలు
మళ్లీ మళ్లీ రాసుకుంటూ వుండాలి
ఎవ్వరైనా ఇప్పుడు చెయ్యాల్సింది
ఒక్కటే..
హృదయ కుహరం అహరహం
కొత్తదనాలు తొడిగెట్టు
ఆనందాల్ని పోగు చేసుకోవాలి..!

– డా॥ కటుకోఝ్వల రమేష్

# బాధ్యత

సింగిల్ పేజ కథ

"అంతా చాలా బాగుంది కానీ, అమ్మాయికి ఎలా చెప్పాలో? అర్థం కావట్లేదు" అన్నాడు మోహన్ భార్య లలితతో.

"అవునండీ! నాకూ అదే భయం వేస్తోంది. అమ్మాయి ఎక్కడ తప్పుగా అనుకుంటుందేమో? అని".

"పోనీ వాళ్లకు వద్దని చెప్పేద్దామా?" "ఈ కాలంలో అసలు అలా ఉండేవాళ్ళు ఎవరుంటారు? ఇంకొక్కసారి ఆలోచించండి" "విషయం అమ్మాయిముందు పెడదాం. మనకు ఇష్టమని చెప్పొద్దు. అమ్మాయి ఎలా అంటే అలా చేద్దాం". "అదే మంచిది. మనకు ఎంత మంచిది అనిపించినా కలిసి బతకాల్సింది అదేగా" అంది లలిత.

ఆఫీస్‌కి వెళ్లిన మోహన్ సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేసాడు. కూతురు మౌనిక ఎప్పుడు వస్తుందా? అని ఆత్రంగా ఎదురు చూడసాగారు మోహన్, లలితలు.

ఆఫీస్ నుండి వచ్చి, ఫ్రెష్ అయ్యి హాల్లో సోఫాలో కూర్చుని, రిమోట్‌తో టీవీ చానల్స్ మారుస్తున్న మౌనికను చూసి లలిత కాఫీ కలిపి తెచ్చిచ్చి, మౌనిక పక్కనే కూర్చుంది. లలిత రావటం చూసి మోహన్ కూడా వచ్చి సోఫా పక్కనే ఉన్న చైర్‌లో కూర్చున్నాడు.

కూతుర్ని చూస్తూ "అమ్మా మౌనీ! మీ అత్త పొద్దుట ఫోన్ చేసిందిరా! ఒక సంబంధం గురించి చెప్పింది. అత్త గురించి తెలుసుగా! పెళ్లి సంబంధం అంటే అన్ని రకాలుగా చక్కగా ఆలోచిస్తుంది. తన కూతుళ్ల వాణి, గీతలకు ఏమాత్రం కంగారు పడకుండా ఎంత బాగా వెతికి, చక్కటి సంబంధాలు చేసిందో నీకు తెలుసుగా.

వాళ్ల ఇప్పుడు అన్ని రకాలుగా చాలా సంతోషంగా ఉన్నారు. అందుకే అత్త చెప్పిన సంబంధం తోసిపడేయలేక, నీకు చెబుతున్నాను. ఇందులో బలవంతం ఏమీ లేదు. నీకు అన్ని విధాలా నచ్చితేనే ముందుకు వెళ్దాం" అని కూతురు వైపు చూసాడు మోహన్.

"చెప్పండి నాన్నా"

"అబ్బాయి పేరు నిఖిల్. ఇక్కడే హైదరాబాద్‌లోనే ఓ బట్టలకొట్టు యజమాని. ఇద్దరు అక్కలు. పిల్లాడి ఫొటో కూడా చూసాం. చూడటానికి బాగానే ఉన్నాడు. మంచి కుటుంబం. తండ్రి లేడు. తల్లి చాలా నిదానం. కానీ..." అని ఆగిపోయాడు మోహన్. "కానీ ..ఏమైంది నాన్నా?"

"అబ్బాయి చదివింది టెన్త్ క్లాస్ వరకే. నువ్వేమో బిటెక్ చేసి, నెలకి నలభై వేల రూపాయలు సంపాదిస్తున్నావ్, అందుకే ఆలోచిస్తున్నాం".

"అబ్బాయి సెవెంత్ క్లాస్‌లో ఉండగా వాళ్ళ నాన్న చనిపోయాడట. తండ్రి పని చేసిన కంపెనీవాళ్లు ఇచ్చిన డబ్బులతో కొంత కాలం ఇల్లు గడిచింది. కానీ తర్వాత చాలా కష్టమైందట. దాంతో అబ్బాయి ఒక సంవత్సరం చదువు మానేసి కూలి పనికి కూడా వెళ్లాడట. వాళ్ళమ్మ మిషన్ కుట్టి సంపాదించి ఇల్లు గడుపుతుంటే, ఎలాగోలా టెన్త్ పూర్తి చేసి, వాళ్ళ అమ్మ కష్టం చూడలేక, నెమ్మదిగా బట్టల వ్యాపారం మొదలుపెట్టాడు.

తెలివితేటలతో వ్యాపారం పెంచుకుని మంచి సెంటర్‌లో షోరూం కూడా తెరిచాడు. తన కష్టార్జితంతోనే ఇద్దరు అక్కలకు మంచి సంబంధాలు చూసి పెళ్లి చేశాడు. వాళ్ల ఇప్పుడు వాళ్ళ అత్తారింట్లో సంతోషంగా ఉన్నారు. సొంత ఇల్లు ఉంది. బాగా నడుస్తున్న షాపు ఉంది. అన్ని బాగున్నాయి కానీ, అబ్బాయి చదువు తక్కువ. అందుకే నేను మీ అమ్మ ఆలోచిస్తున్నాం" అని చెప్పటం ముగించి కూతురు వైపు చూసాడు.

తండ్రి చెప్పిందంతా విని, ఒక్క నిమిషం నిశ్శబ్దంగా ఉండి తర్వాత "నాన్నా! ఈ సంబంధం నాకు చాలా బాగా నచ్చింది. నా వైపు నుండి అంగీకారమే" అని చెప్పింది మౌనిక. "అబ్బాయి చదువు...." అని నసిగింది లలిత.

"అమ్మా! చదువుదేముంది? సంస్కారం ముఖ్యం. సంస్కారం లేని చదువు, పేరు వెనక తోక మాత్రమే. కష్టాలు అందరికీ ఏదో ఒక సమయంలో వస్తాయి. వాటిని తట్టుకోలేక కొంతమంది ఆత్మహత్యలు చేసుకుంటుంటే, ఇంకొంతమంది వాటిని తప్పించుకుని పారిపోతారు. మరి కొంతమంది వాటిల్లో నుండి బయట పడటానికి నానా అడ్డదారులు తొక్కుతారు. అతి కొద్ది మంది మాత్రమే ధైర్యంగా నిలబడతారు అదే సమర్థత. బాధ్యత తెలిసిన భర్త దొరకటం కంటే అదృష్టం ఏముంటుంది? అందుకే ఈ సంబంధం నాకు ఇష్టమే వాళ్లతో మాట్లాడండి నాన్న" అని చెప్పి తల వంచుకుంది మౌనిక.



కూతురు మాటలకు సంతోషంతో, ఒకింత గర్వంతో, లలిత వైపు చూసాడు మోహన్. వెంటనే జేబులో నుండి ఫోన్ తీసి వాళ్ళ అక్కకు ఫోన్ చేసి "అక్కా! ఈ సంబంధం మౌనికకు కూడా నచ్చింది. వాళ్లతో మాట్లాడేసేయ్" అన్నాడు. "ఇంతకుముందే మాట్లాడేసానురా! మన మౌని ఫొటో కూడా పంపా. మౌని వాళ్ళకి బాగా నచ్చింది. మీకు అంగీకారమైతే, ఈ వారంలోనే మంచి రోజు చూసుకుని వస్తామంటున్నారు. నిఖిల్, మౌని ఒకరికొకరు చూసుకొని, ఓకే చెప్తే, ఆ రోజే తాంబూలాలు పుచ్చేసుకుందాం.. అంటున్నారు" అని చెప్పింది తాయారమ్మ.

"సరే అక్కా, చాలా సంతోషం. వాళ్ళని రమ్మని చెప్పు" అని ఫోన్ పెట్టేసి విషయం చెప్పాడు మోహన్.

విషయం విన్న లలిత, మౌనికల మొహాలు సంతోషంతో వెలిగిపోయాయి.

- శశి

# మనసుల మమకార మాలిక

**ప్రపంచం** ఎంత పెద్దదైనా, మనసుల అనుబంధం మాత్రం అందరికీ ఒకే భాష. కంటిలో కరుణ, చేతిలో సాయం, హృదయంలో స్నేహం ఉంటే, మనం ఎక్కడ ఉన్నా మానవీయత మనల్ని కలుపుతుంది. పల్లెలో చేలో కూలి పనివాడు అన్నం పంచుకోవడం నుంచి, నగరంలో వృద్ధాశ్రమంలో చిరునవ్వు పంచే యువకుడు వరకు ఈ అనుబంధమే జీవనానికి అర్థం. సరిహద్దులు, భాషలు, మతాలు వేరైనా మనసుల మమకారం మాత్రం ఒకటే.

మానవ అనుబంధాల పుట్టినిల్లు భారతదేశం. ఇక్కడ బంధం కేవలం రక్త సంబంధాలకే పరిమితం కాదు, మనసు కలిసిన ప్రతి ఒక్కరినీ మనవాడిగా అంగీకరించే విశాల ధృక్కోణం మన సంస్కృతిలో ఉంది. పండుగలు, జాతరలు, వివాహాలు అన్నీ ఈ బంధాలను గట్టిగా కట్టిపడేస్తాయి. పెద్దవారికి గౌరవం, చిన్నవారికి మమత, పొరుగువారితో పంచుకునే అన్నం అన్నీ మన జీవితాన్ని మధురంగా మారుస్తాయి. ఊరి వారంతా ఒకే బంధువుల్లా ఉండే వాతావరణం, కష్టసుఖాల్లో తోడుగా నిలిచే మనసు మన సంస్కృతికి బలమైన పునాది. పల్లెలోగానీ పట్టణాల్లోగానీ మానవీయత పువ్వులా వికసిస్తుంది. పేదవాడి ఇల్లు గానీ, ధనవంతుడి ఇల్లు గానీ ఒకరి కష్టాన్ని మరొకరు మోసుకునే మనోవైఖరి ఇక్కడ ప్రత్యేకత. ఊర్లో పెళ్ళి అయితే అందరూ పనిలో పాలుపంచుకుంటారు, మరణం జరిగితే కష్టాన్ని పంచుకుంటారు. ఈ మానవీయ భావజాలం మన పండుగలలో ప్రతిఫలిస్తుంది. సంక్రాంతి, దసరా, దీపావళి, ఉగాది లాంటి పండుగల్లో ఆహారం, ఆనందం అందరితో పంచుకోవడం మన పూర్వీకుల నుంచి వచ్చిన విలువ. పల్లెల్లో వడ్లకోత పూర్తయిన తర్వాత అన్నం పంచుకునే విందులు, పండ్లతో చేసే సామూహిక విందులు, జాతరల్లో పాటలు, ఆటలు ఇవన్నీ ఒకరి కడుపు మరొకరు నింపే మానవత్వాన్ని తెలియజేస్తాయి. అన్నదానమే అన్నీ అన్న నమ్మకం ఇక్కడ వేరు వేసింది. కేవలం మనుషులకే కాదు, జంతువులకు కూడా పండుగల్లో ప్రత్యేక ఆహారం పెట్టే సంప్రదాయం మనదే. అలా కుటుంబం, సమాజం,





ప్రకృతి అన్నీ కలిసిన అనుబంధాల ముద్దుబంటిగా భారత్ నిలుస్తుంది.

**జపాన్‌లో** అనుబంధాలను క్రమశిక్షణతో, గౌరవంతో కాపాడటం ప్రధానంగా ఉంటుంది. పెద్దవారికి వంగి నమస్కరించడం గౌరవానికి ప్రతీక. 'ఒమియాగే' అనే కానుకల పద్ధతి ఇక్కడ ప్రత్యేకం. ఎక్కడికి వెళ్లినా తిరిగి వచ్చినప్పుడు బంధువులకు, స్నేహితులకు చిన్న చిన్న బహుమతులు ఇవ్వడం వారికి ఆనవాయితీ. ఆహారాన్ని పంచుకోవడం, కలిసి భోజనం చేయడం వారి జీవనంలో ముఖ్యమైన భాగం. పొరుగువారికి సాయం చేయడం, సహోద్యోగులతో స్నేహబంధం కాపాడుకోవడం కచ్చితంగా పాటిస్తారు. 'హనామి' పూల పండుగలో కుటుంబం, మిత్రులు కలిసి చెర్రీ పూల చెట్ల కింద కూర్చొని ఆనందిస్తారు. వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక గౌరవం ఉంటుంది. పిల్లలకు చిన్నప్పటి నుండే కృతజ్ఞతా భావం, ఇతరులకు ఇబ్బంది కలిగించకూడదనే విలువ బోధిస్తారు. విపత్తుల సమయంలో ఒకరికి ఒకరు మద్దతుగా నిలవడం జపాన్ ప్రజల గొప్ప లక్షణం.

**చైనాలో** కుటుంబ అనుబంధాలు చాలా గాఢంగా ఉంటాయి. 'ఫిలియల్ పైటీ' అనే పెద్దలకు గౌరవం చూపే సంప్రదాయం అక్కడ ప్రధానంగా ఉంటుంది. పండుగల సమయంలో కుటుంబ సభ్యులు అందరూ ఒకేచోట చేరి భోజనం చేయడం తప్పనిసరి. చైనీస్ నూతన సంవత్సరంలో పెద్దవారికి ఎర్రపెట్టెల్లో డబ్బు ఇచ్చే 'హాంగ్ బావో' సంప్రదాయం పాటిస్తారు.

పొరుగువారితో మంచి సంబంధాలు కాపాడుకోవడం చాలా ముఖ్యమని భావిస్తారు. కష్టసమయంలో బంధువులు, స్నేహితులు సహాయం చేయడం సహజం. అక్కడ వివాహ వేడుకలు వైభవంగా జరుగుతాయి, అందులో పెద్దవారు ఆశీర్వాదాలు ఇవ్వడం ప్రత్యేకం. గ్రామీణ ప్రాంతాల్లో ఒకరి పనికి మరొకరు తోడ్పడే పద్ధతి ఇప్పటికీ ఇంకా బలంగా కొనసాగుతోంది.

**ఫ్రాన్స్‌లో** మానవ అనుబంధాలు ఆహార పంచుకునే పద్ధతుల్లో, కుటుంబ సమావేశాల్లో బలంగా ప్రతిఫలిస్తాయి.

ఆదివారం మధ్యాహ్నం కుటుంబం, స్నేహితులు ఒకే బల్ల దగ్గర కూర్చుని భోజనం చేయడం ఆనవాయితీ. పుట్టినరోజులు, వివాహాలు, పండుగలలో మిత్రులతో కాఫీ తాగడం, చర్చించడం మమకారాన్ని పెంచుతుంది. పొరుగువారితో స్నేహబంధం కాపాడుకోవడాన్ని ఫ్రెంచ్ ప్రజలు ప్రాధాన్యం ఇస్తారు. 'ఫేట్ డే లా మ్యూజిక్' ఉత్సవంలో ఊరి ప్రజలంతా కలిసి పాటలు పాడటం, డ్యాన్స్ చేయడం సామూహిక ఆనందానికి ఉదాహరణ.



**ఇటలీ** ప్రజల జీవితం కుటుంబం చుట్టూ తిరుగుతుంది. పెద్ద కుటుంబాలు ఒకే ఇంట్లో ఉండటం సాధారణం. ఆదివారం సాయంత్రం పాస్తా, పిజ్జా విందులు వారి అనుబంధానికి ప్రతీక. పెద్దవారు చెప్పే కథలు, జ్ఞాపకాలు యువతకు ప్రేరణగా ఉంటాయి. వివాహాలు, పండుగలు ఉత్సాహంగా జరుపుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో పంట కోత పూర్తయిన తర్వాత అందరూ కలిసి భోజనం చేయడం, పాటలు పాడడం సంప్రదాయం. పండుగల సమయంలో ఊరంతా ఒకే కుటుంబంలా గడపడం సాధారణం.

**బ్రెజిల్** ప్రజలు ఉత్సాహంతో అనుబంధాలను కాపాడుకుంటారు. 'కార్నివల్' ఉత్సవంలో వీధులన్నీ నృత్యం, సంగీతంతో నిండిపోతాయి. కుటుంబం, స్నేహితులతో సముద్రతీరంలో గడపడం, విందులు చేయడం ఆనవాయితీ. పుట్టినరోజులు, వివాహాలు పెద్ద విందుల్లా జరుగుతాయి. పొరుగువారితో స్నేహం, సహాయం చేయడం సహజం. ఫుట్‌బాల్ ఆట అందరినీ కలిపే బంధం. పండుగలలో పేదలకు ఆహారం పంచడం, దుస్తులు ఇవ్వడం చేస్తారు. విపత్తుల సమయంలో ప్రజలు చేతులు కలిపి సహాయం అందిస్తారు.

**మెక్సికోలో** కుటుంబ బంధాలు గాఢంగా ఉంటాయి. 'డే ఆఫ్ ది డెడ్' పండుగలో మరణించిన బంధువులను స్మరించటం, వారి జ్ఞాపకాలను పంచుకోవడం ప్రత్యేకం. వివాహాలు, పుట్టినరోజులు పెద్ద వేడుకలుగా జరుగుతాయి. పొరుగువారితో సహకారం, పండుగలలో విందులు, సంగీతం, నృత్యం చేస్తారు. మార్కెట్లలో ఒకరికి ఒకరు సహాయం చేయడం సాధారణం. వృద్ధులను గౌరవించడం, పిల్లలను ప్రేమతో పెంచడం విలువైన సంప్రదాయం.

**రష్యాలో** మానవ అనుబంధాలు చలి మధ్య వేడిగా ఉంటాయి. కుటుంబం, స్నేహితులతో కలిసి వేడి సూప్, రొట్టెలు పంచుకోవడం సంప్రదాయం. పండుగలలో పెద్దవారికి కానుకలు, చిన్నవారికి మిఠాయిలు ఇవ్వడం ఆనవాయితీ. నూతన సంవత్సరం వేడుకలు వైభవంగా జరుగుతాయి. విపత్తులలో ప్రజలు పరస్పర సహకారంతో నిలుస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒకరి పనికి మరొకరు సహాయం చేయడం ఇప్పటికీ కొనసాగుతుంది.



**ఈజిప్ట్‌లో** కుటుంబ బంధాలు, ఆతిథ్యం ప్రధానమైనవి. అతిథి వస్తే ఇల్లు పండుగలా మారుతుంది. పండుగలలో పెద్ద విందులు, పొరుగువారితో స్నేహం, సహాయం సహజం. వివాహాలు పెద్ద ఉత్సవాల్లా జరుగుతాయి. వృద్ధులను గౌరవించడం, పిల్లలను మమతతో చూసుకోవడం ప్రత్యేకం. ధార్మిక పండుగలలో పేదలకు ఆహారం, బట్టలు పంచడం ఆనవాయితీ.

**దక్షిణాఫ్రికాలో** భిన్న జాతులు, భాషలున్నా మానవీయత బలంగా ఉంది. 'ఉబుంతు' తత్వం-నేను ఉన్నది మనందరం ఉన్నందువల్ల. జీవన విధానం, పండుగలు, క్రీడా ఉత్సవాలు, విందులు అందరినీ కలుపుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో పంట కోతల తర్వాత సామూహిక విందులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

**థాయ్‌లాండ్** ప్రజలు స్నేహపూర్వక ఆతిథ్యంలో ప్రసిద్ధులు. 'వాయ్' నమస్కార పద్ధతి గౌరవానికి ప్రతీక. 'సోంగ్‌క్రాన్' నీటి పండుగలో ప్రజలు నీటితో ఆడుకుంటూ ఆనందం పంచుకుంటారు. వృద్ధులను గౌరవించడం, పేదలకు ఆహారం పంచడం విలువైన సంప్రదాయం.

**నేపాల్** ప్రజలు పర్వతాల మధ్య సాదా సీదా జీవనం గడుపుతారు. 'దసైన్' పండుగలో పెద్దవారు చిన్నవారికి ఆశీర్వాదం ఇస్తారు, విందులు చేస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో పంట పనులు కలిసి చేయడం ఇప్పటికీ బలంగా ఉంది.

**భూటాన్** ప్రజలు ఆనందాన్ని జీవన లక్ష్యంగా చూస్తారు. 'గ్రాస్ నేషనల్ హ్యాపినెస్' తత్వం అక్కడి జీవన విధానం. వృద్ధులకు గౌరవం, చిన్నవారికి మమత బలంగా ఉంటుంది. ఆలయాల దగ్గర సామూహిక విందులు, సహాయం సాధారణం.

**ఇండోనేషియాలో** 'గొటాంగ్ రోయోంగ్' అనే పరస్పర సహకార పద్ధతి ముఖ్య లక్షణం. వివాహాలు, పండుగలు సామూహికంగా జరుపుతారు. విపత్తులలో ప్రజలు చేతులు కలిపి సహాయం అందిస్తారు.

**– డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్**

కథ

# చిట్టెలుక అదృష్టం

నరసింహపురంలో మార్జాలం అనే ఒక పిల్లి ఉండేది. అది ఒంటరిగా ఉన్న ఒక చిట్టెలుకను చూసి "ఓ చిట్టెలుకా! నేను ఎలుకలను తినడం ఎప్పుడో మానేశాను. నీవు నా వద్దకే వచ్చి ఆడుకోవచ్చు" అని అంది.

చిట్టెలుక దాని మాటలను నమ్మింది. అది పిల్లి వద్దకు రాగానే ఆ పిల్లి వెంటనే దానిని మోసంతో తన నోటితో పట్టుకొంది. చిట్టెలుక "అయ్యో! అమ్మ చెప్పిన మాట వినకుండా వీధిలోకి వచ్చి ఈ పిల్లి కపట మాటలను నమ్మి దానికి దొరికిపోయాను. ఇప్పుడు బాధపడి ప్రయోజనం లేదు. ఆపద సమయంలో ధైర్యంగా ఉండి ఉపాయం ఆలోచించాలని పెద్దలు చెప్పగా విన్నాను. అందువల్ల ఏదైనా ఉపాయంతో ఈ గండం నుండి గట్టెకుతాను" అని మనసులో అనుకొంది.

తర్వాత అది పిల్లితో "పిల్లిమామా! నీకు చేపలు ఎక్కువ ఇష్టమా! ఎలుకలా?" అని ప్రశ్నించింది. పిల్లి మాట్లాడలేదు. "అయ్యో! నేను మాటలు రాని ఈ పిల్లికి దొరికినట్లు ఉన్నాను. దీనికి మాటలు వస్తే నాకు ఎంచక్కా కబుర్లు చెప్పి నా ముచ్చట తీర్చేది" అని అంది. అది విన్న పిల్లి ఆ చిట్టెలుకను తన పళ్ల సందున గట్టిగా పట్టుకొని కోపంతో "నీ ఎత్తు నాకు అర్థమైంది. నేను మాట్లాడితే నా నోరు వదులై నా నుండి తప్పించుకోవాలని నీవు చూస్తున్నావు" అని అంది.

తన ఎత్తు పారకపోయేసరికి ఆ చిట్టెలుక ముందు నిరాశ పడింది. కానీ తర్వాత మరోమారు ప్రయత్నిస్తే తప్పు లేదనుకొని ధైర్యంగా "పిల్లి మామా! నేను నీకు ఏది ఇష్టమని? అడిగాను. అందుకు కోప్పడడం ఎందుకు? నీకు చేపలు ఇష్టమైతే వాటిని నీకు చూపించి సాయం చేయాలని నాకు ఉంది. చనిపోయే ముందు కనీసం ఈ ఒక్క సాయం చేసినా నాకు తృప్తిగా ఉంటుంది" అని అంది. అది విన్న పిల్లి ఆ చిట్టెలుకను తన నోటితో గట్టిగా పట్టుకొని "నాకు రెండూ ఇష్టమే" అని అంది. "అలాగైతే నీకు చేపలు ఉన్న చెరువును చూపిస్తాను పద" అని అంది. అప్పుడు పిల్లి తన మనసులో "నేను చేపల జాడను కూడా దీని ద్వారా తెలుసుకొని తర్వాత దీని పని పడతాను" అని అనుకొంది. తర్వాత అది సరేనంది. ఆ చిట్టెలుక సంతోషంతో చేపలు ఉన్న చెరువు వైపు దారిని చూపించింది.

పిల్లి కొద్ది దూరం పోగానే అనుకోకుండా చెట్టు చాటు నుంచి ఒక కుక్క "భౌ.. భౌ.." మంటూ మొరుగుతూ వచ్చింది. దాన్ని చూసిన పిల్లి భయపడి అది "మ్యావ్, మ్యావ్" మని అరచింది. అలా అరచినప్పుడు దాని నోరు వదులు కావడంతో ఆ ఎలుక ఇదే సమయమని భావించి దాని నోట్లో నుంచి దూకి వెంటనే పారిపోయింది. ఆ పిల్లి కుక్కను చూసి అక్కడనుండి వెంటనే అది కూడా పారిపోయింది. తర్వాత ఎలుక తన అదృష్టానికి ఎంతో సంతోషించి "హమ్మయ్యా! నేను నా అదృష్టంకొద్దీ ప్రాణాలతో బయటపడ్డాను. ఇకముందు ఒంటరిగా శత్రువు వద్దకు వెళ్ళకూడదని నాకు తెలిసింది. అమ్మ చెప్పిన మాటలు వినాలని కూడా అర్థమైంది. అపాయంలో మన ఉపాయం విఫలమైనా మరో ప్రయత్నం చేయాలని కూడా నేను తెలుసుకున్నాను. ఆ కుక్క రాకపోతే నేను ఈ పిల్లి చేతిలో మరణించేదాన్ని" అని అనుకొంది.

తర్వాత మరెన్నడూ ఆ ఎలుక ఒంటరిగా శత్రువు వద్దకు వెళ్లలేదు.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

# బాలగేయం

## ఆటా.. పాట

అటా పాట ఉల్లాసం
ఆరోగ్యానికి ఉత్సాహం
ఆనందానికి ఆహ్లాదం
సంతోషానికి స్నేహం.

పున్నమి వెన్నెల్లో
చల్లని పొద్దుల్లో
ఎంచక్కా ఆడుదాం
తైతక్కలాడుదాం.

సంధ్యా సమయంలో
పిల్ల గాలితో
సక్కంగా విహరిద్దాం
ఏకంగా కలిసుందాం.

పొద్దు పొడిచే వేళల్లో
పచ్చని పచ్చిక బయల్లో
పాటలు పాడుదాం
సంగీతం పలికిద్దాం.

ప్రకృతి ఒడిలో
కమ్మని పచ్చదనంలో
ధ్యానంలో వుందాం
విజ్ఞానం పెంచుకుందాం.

– నరెడ్డుల రాజారెడ్డి

# హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

సి.మంజూష, కనిగిరి

**ప్రశ్న: డెత్ వ్యాలీలో రాళ్లు కదులుతాయంటారు. నిజమేనా? ఇదెలా సాధ్యం?**

**జవాబు:** కాలిఫోర్నియాలోని డెత్ వ్యాలీలో రాళ్లు స్పష్టంగా ఒక చోట నుంచి మరో చోటుకు కదులుతున్నాయి. కానీ ఈ వింతకు సరైన శాస్త్రీయ వివరణ లేదు. అవి కదులుతుండగా ఎవరూ చూడలేదు. దాదాపు 5 కి.మీ. విస్తీర్ణంలోని ఒక ఎండిపోయిన చెరువులో చిన్న గులకరాళ్ల దగ్గర నుండి దాదాపు వంద కిలోల బరువుండే పెద్ద బండల వరకూ ఒక చోట నుంచి మరో చోటకు కదులుతున్నాయి. అవి కదిలినట్టుగా నేల మీద చారలు, గీతలు, గుర్తులు కనిపిస్తున్నాయి. కొన్ని ఏకంగా 600 అడుగుల దూరం కదులుతుండగా, పెద్ద బండలు మాత్రం 200 అడుగుల వరకూ వెళ్లగలుగుతున్నాయి. పరిసర ప్రాంతాలలోని కొండల నుంచి వీచే బలమైన గాలులకు అవి జరుగుతున్నాయని కొందరు, అక్కడి నేల పొరల్లో మంచు పలకలు ఉండటం వల్ల ఇలా జరుగుతోందని మరికొందరు ఊహించి చెబుతున్నారేగానీ, ఏదీ నిర్ధారణ కాలేదు.

ఎ.మధు, గుంటూరు

**ప్రశ్న: కొండకు, పర్వతానికి తేడా ఏమిటి? వివరించగలరు.**

**జవాబు:** 900 మీటర్ల కన్నా తక్కువ ఎత్తు ఉన్నవాటిని కొండలని, అంతకు మించి ఎక్కువ ఎత్తు వున్నవాటిని పర్వతాలని అంటారు.

# మనుగడ కోసం నిత్య పోరాటం

**బతకడానికి నిత్యం పోరు చేయాల్సిందే. జీవించడానికి మరికొంత ఆరాటపడాల్సిందే. అర్థవంతంగా జీవించడానికి క్షణ క్షణం సుదీర్ఘ జీవన పోరాటం కొనసాగించాల్సిందే. అలసత్వం విజయాన్ని దూరం చేస్తుంది. అర్థ ప్రయత్నం అర్థ విజయాన్ని ఇవ్వదు.**

పరీక్షల్లో పాస్ కావాలంటే కనీసం మార్కులు దాటాల్సిందే. గౌరవ ప్రదమైన జీవనయానానికి పలు అవాంతరాలను దాటాల్సిందే. ప్రమాదాలు చెప్పి రావు. ఎదురీదకుండా విజయతీరం చేరలేం.

ప్రతి జీవి తన మనుగడ కోసం నిరంతరం పోరాటం చేస్తూనే ఉంది. ప్రతి ప్రయత్నంలో గెలుపు, ఓటములు దోబూచులాట ఆడుతూనే ఉంటాయి. గెలుపు సంతోషానికి కారణం అయితే ఓటమి ఒక విలువైన అనుభవాన్ని బహూకరిస్తుంది. మనస్ఫూర్తిగా చేసే ప్రయత్నమే మన చేతుల్లో ఉంటుంది. కర్మ చేయడం మన విధి. ఫలితం ఎలా ఉన్నా స్వాగతించడం వివేకవంతుల పని.

విద్యతో పాటు వివేకంతో కూడిన నైపుణ్యాలు స్వంతం చేసుకున్న యువత ఆధునిక వివేకానందులు అవుతారని గమనించాలి.

అడవిలోని జింకను వేటాడడానికి సింహం వెంట పడుతుంది. ఈ పరుగు మనకు అత్యంత విలువైన జీవిత పాఠం నేర్పుతున్నది. జింక అత్యంత వేగంగా పరిగెత్తి సింహానికి దొరక్కుండా ప్రాణాలను కాపాడుకుంటుంది. కొద్ది అలసత్వం వహించినా మరుక్షణమే సింహం చేతిలో ప్రాణాలు కోల్పోయి ఆహారం అవుతుంది.

అడవికి రాజైన సింహం కూడ తన మనుగడ కోసం ఆహార వేటలో పరుగు తీయాల్సిందే. జింకను వేటాడి ఆహారం పొందని యెడల ఆ రోజు సింహం కూడా ఆకలి కడుపుతో పడుకుంటుంది. మరునాడు నీరసం పెరిగి వేగంగా పరుగెత్తలేక తన ఆహారాన్ని పొందలేదు. ఇదే క్రమంలో నీరసించి ఏదో ఒక రోజు సింహం కూడా ఆకలితో చనిపోతుంది. వేగంగా పరుగు తీయని జింక వెంటనే సింహానికి ఆహారమై చనిపోతుంది. అదే విధంగా వేటలో ఆహారాన్ని పొందలేని సింహం కూడా కొన్ని రోజులకు ఆకలితో చనిపోతుంది. అంటే ఏ ప్రాణి అయినా తన మనుగడ కోసం పోరాటం చేయాల్సి ఉంటుంది. పోరాటాన్ని చేయలేని జీవులు కాలగర్భంలో కలిసిపోతాయి.



మనిషి కూడా అంతే. నిత్యం అర్థవంతంగా జీవించడానికి సన్మార్గంలో జీవన పోరాటం కొనసాగించాల్సిందే. శ్రమ చేస్తేనే ఫలితం లభించడం కష్టమైన డిజిటల్ పోటీ యుగంలో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా మనల్ని దాటి లక్షల మంది పోటీలో ముందుకు వెళతారు, మనకు ఓటమిని చవి చూపిస్తారు.

గెలవగలమనే నమ్మకం మనకు తోడు కావాలి. ఓటమిని స్వీకరించే ధైర్యం కూడా మన స్వంతం కావాలి.

విజేతలెవరూ విలక్షణమైన పనులు చేయరని, మనం చేసే సాధారణ పనులనే వారు విలక్షణంగా చేస్తారని ఆకళింపు చేసుకోవాలి. ఓటమి అడ్డుగోడలను దాటుకుంటూ విజయ దర్వాజాను చేరుకోవాలి.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

## కార్టూన్లకు ఆహ్వానం

**కార్టూనిస్టుల నుంచి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని కార్టూన్లను తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

sunmagvaartha@gmail.com

# గాంధీజీ.. సత్యాగ్రహ స్ఫూర్తి

1869 అక్టోబరు 2న గుజరాత్ రాష్ట్రంలోని పోర్‌బందర్‌లో జన్మించిన గాంధీ బాల్యం నుండే సత్యం, నియమశీలత, త్యాగం వంటి విలువలతో పెరిగాడు. తల్లి పుతలీబాయి భక్తి శ్రద్ధలతో నిండిన స్త్రీ; తండ్రి కరంచంద్ కఠిన నైతిక విలువలతో కూడిన పరిపాలకుడు. ఈ ఇద్దరి ప్రభావం గాంధీ జీవనంలో లోతైన ముద్ర వేసింది. చిన్ననాటి నుంచి ఉపవాసం, నియమాలు, నిజాయితీ పట్ల అతనికి ఉన్న ఆకర్షణ తరువాతి కాలంలో ఒక విప్లవాత్మక ఉద్యమ నాయకత్వానికి పునాదిగా నిలిచింది. విద్యాభ్యాసం పూర్తి చేసిన తరువాత 1888లో గాంధీ లండన్ వెళ్లి న్యాయ విద్యాభ్యాసం చేశాడు. అక్కడ పాశ్చాత్య సంస్కృతి ఆకర్షించినప్పటికీ త్వరగానే తన భారతీయ మూలాలను గుర్తించి సాదాసీదా జీవనం, ఆచరణాత్మక ధర్మం వైపు మొగ్గు చూపాడు. 1891లో న్యాయవాది పట్టా పొంది స్వదేశానికి వచ్చినా, వృత్తిలో స్థిరపడలేక 1893లో దక్షిణాఫ్రికాకు వెళ్ళాడు. అక్కడే అతని జీవితం కొత్త మలుపు తిరిగింది.



పీటర్ మారిట్జ్ బర్గ్ రైల్వే స్టేషనులో వర్ణ వివక్ష కారణంగా ట్రైన్‌లోంచి బయటికి తోసేయబడిన అవమానం గాంధీ మనసును కలచివేసింది. ఆ అవమానం ఆయనను ఒక న్యాయవాది నుంచి సామాజిక పోరాట యోధుడిగా మలిచింది.

1915లో స్వదేశానికి తిరిగి వచ్చిన గాంధీ గోపాలకృష్ణ గోఖలే సూచనల మేరకు ముందుగా భారతీయ సమాజ స్థితిగతులను సమీక్షించాడు. బీహార్ చంపారన్‌లో రైతుల సమస్యలు పరిష్కరించడానికి మొదటి సత్యాగ్రహాన్ని చేపట్టాడు. చిన్న చిన్న ఉద్యమాల ద్వారా ప్రజలు గాంధీ అహింసా మార్గం పట్ల నమ్మకం పెంచుకున్నారు. 1919లో రౌలత్ చట్టాల వ్యతిరేకంగా ఉద్యమం దేశ వ్యాప్తంగా ఉధృతమైంది. అదే సమయంలో అమృత్‌సర్‌లో జలియన్ వాలాబాగ్ నరమేధం చోటు చేసుకుంది.

జనరల్ డయ్యర్ ఆదేశాలతో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన ఈ ఘటన గాంధీ మనసును కుదిపేసి సంపూర్ణ స్వాతంత్రం కోసం ఆయన పోరాటాన్ని మరింత దృఢం చేసింది. 1920లో సహకార నిరాకరణ ఉద్యమం ప్రారంభమైంది. లక్షలాది మంది ప్రజలు ప్రభుత్వ ఉద్యోగాలను, పాఠశాలలను, కోర్టులను వదిలి ఉద్యమంలో చేరారు. విదేశీ వస్తువులను దహనం చేసి స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యం ఇచ్చారు.

1930లో ఉప్పు సత్యాగ్రహం గాంధీ జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టం. సబర్మతి ఆశ్రమం నుంచి అనుచరులతో కలిసి రెండు వందల నలభై మైళ్ల దూరం నడిచి దాండీ తీరంలో ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించాడు. ఈ సంఘటన అంతర్జాతీయంగా విస్తృతంగా చర్చకు దారితీసింది. అరవై వేల మందికి పైగా జైలుకు వెళ్ళారు. గాంధీ ప్రపంచ దృష్టిని ఆకర్షించాడు. 1931లో లండన్ రౌండ్ టేబుల్ సమావేశానికి వెళ్లి భారత స్వాతంత్ర్య సమస్యను ప్రపంచ వేదికపై ఉంచాడు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో 1940లో వ్యక్తిగత సత్యాగ్రహాన్ని చేపట్టి బ్రిటిష్ పాలనను సవాలు చేశాడు. 1947లో భారత్ స్వాతంత్ర్యం పొందినప్పటికీ దేశ విభజన గాంధీని తీవ్రంగా కలచి వేసింది. మత హింస ఆగిపోవాలని ఆయన నిరంతరం ఉపవాసాలు చేశాడు. చివరి వరకు ప్రజలను శాంతి, సామరస్య మార్గంలో నడిపించడానికి కృషి చేశాడు. కానీ 1948 జనవరి 30న నాథూరామ్ గోడ్సే కాల్పులకు బలై ప్రాణాలు కోల్పోయాడు.

గాంధీ ఆలోచనలు కేవలం రాజకీయాలకే పరిమితం కాలేదు. స్వదేశీ, ఖాదీ ప్రోత్సాహం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశాడు. స్వావలంబన, స్వచ్ఛత, క్రమశిక్షణ ఆయన ఆర్థిక ఆలోచనల కేంద్రం. ఆయన ఆశ్రమాలు సబర్మతి, వర్ధా సామాజిక సమానత్వానికి ప్రతీకలు.

దళితుల హక్కుల విషయంలో అంబేద్కర్‌తో విభేదాలు ఉన్నప్పటికీ, చివరికి పూణే ఒప్పందం ద్వారా ఒక పరిష్కారం సాధించాడు. గాంధీ, రవీంద్రనాథ్ టాగోర్ మధ్య లేఖల మార్పిడి ఆయన మేధో గంభీరతను చూపిస్తుంది. టాగోర్ గాంధీని 'మహాత్మా' అని మొదటగా సంబోధించగా, గాంధీ టాగోరును 'గురుదేవ్' అని గౌరవించాడు.

ప్రపంచ వ్యాప్తంగా గాంధీ ప్రభావం అపారమైనది. అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ పౌరహక్కుల ఉద్యమాన్ని గాంధీ అహింసా మార్గం ఆధారంగా నడిపాడు. దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా ఆయన ఆలోచనలతో ప్రేరణ పొంది వర్ణవివక్ష వ్యతిరేక పోరాటాన్ని నడిపాడు. మయన్మార్ నాయకురాలు ఆంగ్ సాన్‌సూకీ, అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా వంటి నేతలు గాంధీని తమ ప్రేరణగా పేర్కొన్నారు. అల్‌బర్ట్ ఐన్‌స్టీన్ గాంధీని "భవిష్యత్ తరాలు ఇలాంటి మనిషి భూమిపై నడిచాడని నమ్మడం కూడా కష్టమవుతుంది" అని అన్నాడు.

గాంధీ పేరు కేవలం భారత స్వాతంత్ర్యానికి ప్రతీక కాదు, ప్రపంచ మానవత్వానికి ఒక శాశ్వత మార్గదర్శకం. ఆయన జీవితం రాజకీయ పోరాటం, నైతిక శక్తి, ఆధ్యాత్మిక విప్లవం అన్నింటినీ ఏకం చేసింది. సత్యం, అహింస, స్వదేశీ, స్వావలంబన వంటి విలువలు నేటికీ ప్రపంచానికి దిక్సూచి. ఆయన మరణంతో ఆయన శరీరం కనుమరుగైనప్పటికీ ఆయన ఆలోచనలు, ఆదర్శాలు మానవజాతి చరిత్రలో శాశ్వతంగా నిలిచి ఉన్నాయి.

**- రామకిష్టయ్య సంగనభట్ల**

కథ

# వాడినపూలు వికసించునా?

బుద్ధవరపు కామేశ్వరరావు

ఆ రోజు హైదరాబాద్‌లోని సత్కళా ఇండస్ట్రీ వారి ఆవరణలో ఆ కంపెనీ వ్యవస్థాపకులు కళ్యాణరావు గారి జయంతి వేడుకలు జరుగుతున్నాయి. కంపెనీ మేనేజర్ కృష్ణమూర్తి గారు సభను ప్రారంభిస్తూ–

"అందరిలాగే తాను కూడా ఇది నావల్ల అవదేమో.. అని అనుకోకుండా, కాకినాడకు చెందిన కళ్యాణరావు గారు పాతికేళ్ల క్రితం, భార్యా బిడ్డలతో మన నగరానికి వచ్చి ఓ చిన్న కుటీర పరిశ్రమలా ఈ సంస్థను ప్రారంభించారు. ఆయన వ్యాపార దక్షత మూలంగా ఈరోజు ఈ పరిశ్రమ ఇన్ని వందల మందికి జీవనోపాధి కల్పిస్తోంది. అయితే. ఐదు సంవత్సరాల క్రితం ఆ భార్యాభర్తలు ఓ ప్రమాదంలో మరణించడం వల్ల, వారి పిల్లలు ఈ కంపెనీకి డైరెక్టర్లుగా ఉంటూ, ఆయన లేని లోటు తెలియకుండా సంస్థను ముందుకు నడిపిస్తున్నారు. ఇప్పుడు వారి అబ్బాయి శ్రీ సతీష్‌ని మాట్లాడవలసిందిగా కోరుకుంటున్నాను" అని కూర్చున్నారు కృష్ణమూర్తి.

సతీష్ మాట్లాడుతూ "కాకినాడలో ఓ చిన్న మెడికల్ షాపు నడుపుతున్న మా నాన్నగారికి మా చెల్లాయ్ కళ పుట్టిన తరువాత దశ తిరిగిందిట. అందుకే ఓ మిత్రుని సలహాతో ఇక్కడికి వచ్చి, మా ఇద్దరి పేర్లు కలిసొచ్చేలా సత్కళా ఫార్మా పేరుతో ఈ సంస్థ ప్రారంభించారు. ఆయన జ్ఞాపకార్థం ప్రతీ సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా అందరికీ రెండు నెలల జీతం అదనపు బోనస్‌గా ప్రకటిస్తున్నాను" హర్షధ్వానాల మధ్య చెప్పాడు సతీష్.

..........

ఆ రోజు సాయంత్రం కార్లో ఇంటికి వెళ్తూ, ఉదయం నుండి జరిగిన సంఘటనలు ఆనందంగా చర్చించుకుంటున్నారు అన్నా, చెల్లెలు.

అయితే ఆ ఆనందం తాత్కాలికమేననీ, తాము నిజంగానే బాధపడే రోజు ఓ రెండు వారాలలో వస్తోందని పాపం వాళ్లకు ఆ సమయంలో వాళ్లకు తెలియదు.

..........

ఓ రెండు వారాలు తరువాత ఆ రోజు మధ్యాహ్నం తనను కలుసుకోవడానికి ఎవరో అమ్మాయి వచ్చిందని తెలిసిన కళ, వెయిటింగ్ రూమ్ వైపు వెళ్లింది. బహుశా చెల్లెలు తన కోసం ఏదైనా సంబంధం తెచ్చిందేమోనని ఆమెను చూడడానికి దొంగతనంగా వెంబడించాడు సతీష్.

అచ్చు తనలాగే ఉన్న ఆమెను చూసి ఆశ్చర్యపోయింది కళ. అదే పరిస్థితి ఎదుర్కొన్నాడు సతీష్ కూడా. కాసేపటికి సర్దుకుని "ఎవరండీ మీరు? ఎవరు కావాలి?" అడిగింది.

"అక్కా! నా పేరు అంజని. డైరెక్ట్‌గా పాయింట్లోకి వచ్చేస్తున్నా. వినడానికి విడ్డూరంగా ఉన్నా ఇది వాస్తవం. మనం కవల పిల్లలం అక్కా! ఈ విషయం మొన్ననే మా అమ్మ కమల ద్వారా తెలిసింది" అంది.

"చూడండి, మనిషిని పోలిన మనుషులు ఈ లోకంలో ఏడుగురు ఉంటారు. నువ్వు నాలా ఉన్నంత మాత్రాన మనం కవలలం అయిపోం. డబ్బులు కోసం ఇలాంటి బ్లాక్ మెయిల్ చేసేవాళ్లను చాలా మందిని చూసాను" అంది కళ.

"అక్కా, నువ్వు నమ్మవని నాకు తెలుసు. కానీ చెప్పడం నా బాధ్యత. సుమారు ముప్పై యేళ్ల క్రితం కాకినాడలోని ఓ హాస్పిటల్‌లో మీ అమ్మగారు పురిటి నొప్పులతో జాయిన్ అయ్యారు. సరిగ్గా అదే సమయంలో మన అమ్మ కూడా కాన్పు కోసం అదే హాస్పిటల్‌లో చేరింది. కానీ, ఆడపిల్ల కోసం తపించే మీ అమ్మగారికి పాపం మృత శిశువు పుట్టింది. ఈ విషయం వింటే మీ అమ్మగారు తట్టుకోలేరని సరిగ్గా అదే సమయంలో మనల్ని కవలపిల్లలుగా కన్న మన అమ్మని ఓ నర్స్ ద్వారా ఒప్పించి మీ నాన్న గారు నిన్ను మీ అమ్మ వద్దకు చేర్చారు.." మధ్యలోనే అంజనిని ఆపి– "నువ్వు చెప్తున్న సినిమా స్టోరీ బాగానే వుంది కానీ ఇంక దయచేయ్" అని చేతులు జోడించి చెప్పింది కళ.

"మిమ్మల్ని బ్లాక్ మెయిల్ చెయ్యడానికి రాలేదు. నిన్ను చూడాలని మన అమ్మ పడుతున్న బాధ భరించలేక వచ్చాను. నీకు అనుమానం ఉంటే మా ఇంటికి వచ్చి మన అమ్మను కలువు. లేదంటే ఈ సంగతి ఇక్కడితో వదిలేయ్.. ఉంటా" అడ్రస్ చెప్పి వేగంగా వెళ్లిపోయింది అంజని.



ఆమె వెళ్లిన కాసేపటికి తేరుకున్న కళ వెనకాల ఉన్న అన్నను చూసి, ఉలిక్కిపడి–

"అన్నయ్యా! ఏమిటి ఈ గొడవ? ఇది నమ్మేటట్టుగా ఉందా?" అడిగింది సందేహంగా.

"ఆమెను చూసిన తరువాత, అలాగే ఆమె చెప్పింది విన్న తరువాత చూస్తే కొంచెం నమ్మేటట్టుగానే ఉంది మరి" విసురుగా చెప్పి లోపలకి వెళ్తున్న అన్న వైపు ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయింది కళ.

..........

అంజని రగిల్చిన సమస్యతో ఓ పది రోజుల వరకూ అన్నా చెల్లెలు ఎడమొహం పెడమొహంగా ఉన్నారు. ఒకే ఇంట్లో ఉన్నా ఇద్దరికీ మాటలు లేవు. కంపెనీకి కూడా విడివిడిగా వెళ్తున్నారు.

ఓ రోజు కొంచెం చొరవ తీసుకుని, "అన్నయ్యా! ఒకే తల్లి కడుపున పుట్టాం, ఒకే తండ్రి పెంపకంలో పెరిగాం, కష్టం సుఖం పంచుకున్నాం. ఈ రోజు ఓ మూడో వ్యక్తి కారణంగా మన మధ్య వైరం సృష్టించుకుందామా? చెప్పు...!?" సూటిగా ప్రశ్నించింది కళ.

"దయచేసి ఒకే తల్లి కడుపున అనవద్దు కళా! ఈ విషయంలో ఇంతకు మించి ఏమీ మాట్లాడవద్దు. కొన్నాళ్లు నన్ను ప్రశాంతంగా ఉండనీ" మొదటిసారిగా తనను పేరుతో పిలిచిన సతీష్ వైపు విభ్రమంగా చూస్తూ ఉండిపోయిన కళ, ఓ నిర్ణయానికి వచ్చింది, ఈ సమస్యకు కారణం తనే కాబట్టి, తానే దీనికి ముగింపు పలకాలని.

..........

ఓ నాలుగు రోజుల తర్వాత తన ఛాంబర్‌లో కూర్చుని పని చేసుకుంటున్న సతీష్ వద్దకు వచ్చిన మేనేజర్ కృష్ణమూర్తి "బాబూ! ఓ పెద్దవాడిగా చెబుతున్నా. మీకూ, చెల్లాయి గారికీ మధ్య మనస్పర్థలు ఏవైనా ఉంటే పరస్పరం కూర్చొని పరిష్కారం చేసుకోవాలి కానీ, ఇలా మౌనంగా ఉండి కంపెనీ విషయాలు పట్టించుకోకుండా ఉండడం భావ్యం కాదు. ఈ నెలలో మన అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయి. మన కాంపిటీటర్స్ విజృంభిస్తున్నారు. మీరు అప్రమత్తంగా లేకపోతే మిమ్మల్నే నమ్ముకున్న వందలాది కుటుంబాలు రోడ్డున పడతాయి" చెప్పవలసిన విషయాన్ని సూటిగా చెప్పారు కృష్ణమూర్తి.

"ఔనండీ! నేనూ అదే అనుకుంటున్నా" అని చెప్పి ఇంటికి బయలుదేరాడు సతీష్.

..........

ఇంటికి వచ్చిన సతీష్‌కి గుమ్మంలో సూట్‌కేసుతో ఎదురైన కళ "సతీష్ గారూ! నేను వెళ్తున్నాను. మన మధ్య రక్తసంబంధం లేకపోయినా, నన్ను సొంత చెల్లెలు కన్నా ఎక్కువగా చూసుకున్నారు. అందుకు జీవితాంతం ఋణపడి ఉంటాను.

ఇక అసలు విషయం, మా చెల్లి అంజని చెప్పింది నిజమే. నేను నిన్ననే మా అమ్మను కలుసుకున్నా. ఇదిగో మన కంపెనీ డైరెక్టర్ పోస్ట్ నుంచి నేను..." కాగితాలు చేతిలో పెడుతూ చెప్పబోయిన కళతో–

"మీ కోసమే వెయిటింగ్. ఇప్పుడే నేను మా అమ్మా, చెల్లాయిల వద్దకు బయలుదేరుతా" అంది కళ.
"ఒకవేళ వాళ్లే ఇక్కడికి వస్తే?"
"ఏమిటి మీరనేది?"
"ఔను చెల్లాయ్ నిజమే! వాళ్లనే ఇక్కడికి తీసుకుని వచ్చాను"

"నేను ఒక అర్జంటు పని మీద కాన్పూర్ వెళ్తున్నా. ఒక్క రెండు రోజులు ఓపిక పట్టు. నా కోసం కాదు. కంపెనీ శ్రేయస్సు కోసం. వచ్చిన తరువాత మాట్లాడుకుందాం.. ప్లీజ్"

సతీష్ మాటలను కాదనలేకపోయింది కళ.

..........

రెండు రోజుల తరువాత ఇంటికి వచ్చిన సతీష్, నేరుగా కళ ఉన్న గదిలోకి వెళ్లి "కళా! ఏం డిసైడ్ చేసుకున్నావ్?" అడిగాడు. "మీ కోసమే వెయిటింగ్. ఇప్పుడే నేను మా అమ్మా, చెల్లాయిల వద్దకు బయలుదేరుతా" అంది కళ.

"ఒకవేళ వాళ్లే ఇక్కడికి వస్తే?" "ఏమిటి మీరనేది?"

"ఔను చెల్లాయ్ నిజమే! వాళ్లనే ఇక్కడికి తీసుకుని వచ్చాను. ఇక అసలు విషయం, నువ్వూ, అంజనీ కవల పిల్లలే. కానీ నువ్వు అనుకున్నట్లుగా మీరు ఆ కమల గారికి పుట్టిన పిల్లలు కాదు. మా అమ్మగారికి పుట్టిన పిల్లలు. కావాలంటే ఈ విషయం ఆ కమలమ్మ గారి ద్వారానే విను" అంటూ వారిని లోపలికి పిలిచాడు సతీష్.

"ఔనమ్మా! సతీష్ బాబు చెప్పింది అక్షర సత్యం. మీరు నాకు పుట్టినవారు కాదు. వరుసగా కాన్పులు పోగొట్టుకున్న నన్ను ఈసారైనా ఓ బిడ్డను కనకపోతే వదిలేస్తామని మా ఆయన, అత్తగారు బెదిరించారు. అయితే అప్పుడు కూడా మృతశిశువు పుట్టడంతో భయపడిన నేను, నాకు తెలిసిన ఓ నర్స్ సహాయంతో సరిగ్గా అదే సమయంలో కవల పిల్లలకు జన్మనిచ్చిన మీ అమ్మగారి వద్ద నుంచి ఓ బిడ్డను సంగ్రహించి, ఆ స్థానంలో ఈ మృత శిశువును పెట్టామమ్మా. నేను చేసింది తప్పే, కానీ తప్పలేదు.

అప్పుడు దొంగిలించిన బిడ్డేనమ్మా ఈ అంజని. ఆ తరువాత కొన్నేళ్లకే మా అత్తా, మా ఆయన కూడా మరణించారు. అప్పుడు వాస్తవం చెప్పి ఈ బిడ్డను తిరిగి ఇచ్చేద్దామని ప్రయత్నం చేసాను. కానీ అప్పటికే మీరు ఆ ఊరు వదలి వెళ్లిపోయారు" వాస్తవం చెప్పింది కమల.

ఆవిడ చెప్పింది వింటూ ఆశ్చర్యపోయిన కళ "అయితే, అసలు మేం మీ పిల్లలమని అబద్ధం చెప్పవలసిన అవసరం ఏమొచ్చింది?" అడిగింది ఆసక్తిగా.

"అది నేను చెబుతా చెల్లాయ్. అసలు నేను కాన్పూర్ వెళ్తున్నానని చెప్పి వెళ్లింది ఈ వ్యవహారం తేల్చడానికే. ముందు నేను కమల గారిని కలిసి విషయం అడగ్గానే ముందు ఆవిడ కూడా ఆ అబద్ధమే మళ్లీ చెప్పారు.

నేను గట్టిగా బెదిరించేసరికి అసలు విషయం బయట పెట్టారు. అది నిజమో కాదో తేల్చడానికి నేను కాకినాడ వెళ్లి, ఆ నర్స్‌ను కలసి యథార్థం రాబట్టాను.

ఇక ఆవిడ అబద్ధం చెప్పడానికి కారణం ఆమెను ఓ వ్యక్తి బెదిరించడం!" అసలు విషయం చెప్పాడు సతీష్.

"ఎవరన్నయ్యా ఆ దౌర్భాగ్యుడు?" కోపంగా అడిగింది కళ.

"ఇంకెవరు మన బిజినెస్ కాంపిటేటర్ సుజనారావు. మనల్ని మానసికంగా బలహీనులను చేసి తన సేల్స్ పెంచుకుందామని ప్లాన్ చేసాడు. పాపం.. ఆయన ప్లాన్ బెడిసికొట్టింది".

"అసలు అతనికి మన విషయాలు ఎలా తెలిసాయి?"

"కళా! మన అంజని పనిచేస్తున్నది అతని కంపెనీలోనే. తనలో నీ పోలికలు చూసి వెంటనే మన కమల గారిని సంప్రదించాడు. ఆవిడ అంజని తన సొంత కూతురనీ, ఆ కళ ఎవరో తనకు తెలియదని చెప్పడంతో, ఆవిడని బెదిరించి మీరిద్దరూ తన పిల్లలే అని అబద్ధం చెప్పమన్నాడు.

గత్యంతరం లేక ఆవిడ ఈ విషయం అంజనికి చెప్పడమూ, ఆ తర్వాత మిగతావన్నీ నీకు తెలిసినవే కదా?"

"నిజంగా ఇదంతా ఓ సినిమా కథలా ఉంది అన్నయ్యా!"

"ఔను..! సినిమాలకు కూడా ఇలాంటి కథలే మూలం. అన్నట్టు ఈరోజు నుంచి మన కమలగారే మనకు అమ్మ. అంతేకాదు, ఇక నుంచి మన ఇండస్ట్రీ పేరు సత్కళాంజని".

"ఈ సంతోషం ఇలాగే సాగాలంటే మనం ఇంకో పని చెయ్యాలి అంజనీ!"

"ఏమిటక్కా అది?"

"మన అన్నయ్య పెళ్లి"

"ఔనక్కా! నిజమే!! ఇంక ఆలస్యం చేయకూడదు"

"సరిపోయింది, ఇన్నాళ్లు పిల్లి మాత్రమే ఉండేది. ఇప్పుడు దానికి ఎలుక కూడా సాక్ష్యానికి వచ్చిందన్నమాట" ఇక నా పని అంతే!

సతీష్ మాటలతో అందరి మొహాలు నవ్వులతో నిండిపోయాయి. ■

# మికో మినీ

ఆటబొమ్మలా కనిపించే మికో మినీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే తెలివైన రోబో. పిల్లలతో ఆడుతూ పాడుతూ, వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెబుతూ ఆల్ ఇన్ వన్ ఫ్రెండ్‌లా ఉంటుంది. చదువు, డాన్స్, పాటలు, ఆటలు ఇలా దేనికి సంబంధించి అడిగినా చెబుతుంది. పిల్లలతో మమేకమై వారితో సరదాగా ఉంటుంది. వారితో ఇంటరాక్ట్ అవుతూ వారి సందేహాలను తీరుస్తుంది. ఆలోచనా శక్తి, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంచేలా రోజువారి ప్రణాళికలు తయారు చేసి ఇస్తుంది. ప్రధానంగా అత్యవసర సమయాల్లో తల్లిదండ్రుల నంబర్లకు, ఇతర ఎమర్జెన్సీ నంబర్లకు సమాచారం ఇచ్చేలా ఈ రోబోకు ఫీచర్ కూడా అమర్చారు.



# అందాల అద్భుత ద్వీపం

జాకిన్‌థోస్ గ్రీస్ దేశంలోని అందమైన అద్భుత ద్వీపం. ఇక్కడి సముద్రంలో అనేక గుహలు ఉంటాయి. ఒకవైపు విశాలమైన ఇసుక తిన్నెలు, మరోవైపు పచ్చదనంతో అలరారే ఎత్తైన పర్వత శిఖరాలు. చుట్టూ నీలిరంగులో మెరిసే సముద్రం. అక్కడి ప్రకృతి ఒడిలో ఎన్నో అందాలు ఎంతో మనోహరంగా ఉంటాయి. జాకిన్‌థోస్‌లోని అత్యంత ప్రసిద్ధి పొందిన పర్యాటక ప్రదేశాలలో నవాగియో బీచ్ ఒకటి. దీనిని షిప్‌రెక్ బీచ్ అని కూడా అంటారు. అందమైన గ్రామాలు, చారిత్రక ప్రదేశాలు, వెనీషియన్ శైలిలో నిర్మితమైన భవనాలు ఇలా చుట్టూ చూడదగిన ప్రదేశాలతో జాకిన్‌థోస్ ద్వీపం పర్యాటకులను ఆకట్టుకుంటాయి. అయితే ఇక్కడి అందమైన ప్రదేశాలను చూసేందుకు పడవలలోనే వెళ్లాల్సి ఉంటుంది.



## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

# పుస్తకం ఎటు పోతోంది?

'పుస్తకం హస్త భూషణం' అంటూ పుస్తకం చేతిలో పట్టుకుని చదవకుండా వుండేవారిని ఎగతాళి చేయటం, పుస్తకం చేతికి ఆభరణంగా భావించటం స్థాయి నుంచి సమాజం దిగజారి పుస్తకం యిక అవసరం లేదనే భావనలు చోటు చేసుకొంటున్నాయి. "వనిత, విత్తం, పుస్తకం పరహస్తం అయితే తిరిగిరావనే" సామెత హెచ్చరిక కూడా మరుగున పడింది.

ఏ భాషలో అయినా అక్షరం క్షరం లేనిది. అక్షరాస్యత అంటే చదువు, చదవడం, రాయడం, గణనం తెలిసి వుండటం. అక్షర జ్ఞానం అవసరం లేని సమాజం ఆటవికం అవుతుంది. ఆధునిక మానవ ప్రగతిలో ముద్రణా యంత్ర ఆవిర్భావం తర్వాత ప్రపంచమంతటా పుస్తక ప్రచురణ విస్తృతం అయింది.



సైన్సు నుంచి సాహిత్యం వరకు పుస్తకం జీవితాలను ప్రభావితం చేస్తోంది. కొత్త విషయాలను, అనుభూతులను, జీవన విధానాలను మమేకం చేసి కొత్త ప్రపంచంలో విహరింపచేస్తుంది.

వినూత్న ప్రేరణలతో యువతకు లక్ష్యం, గమ్యం పుస్తకం నిర్దేశిస్తుంది. పుస్తకం ఏ ప్రక్రియ, ఏ ఇతివృత్తం అయినా మేథను కదిలిస్తుంది. మంచి స్నేహితంగా, అంతర్గత స్రవంతి బోధిస్తుంది. పుస్తకాల పురుగు అనే మాట కొందరికే వర్తిస్తుంది. "చదవటం నేర్చుకోవటం దీపాన్ని వెలిగించటమే. చదివే ప్రతి అక్షరం అగ్నికణమే" అన్నారు విక్టర్ హ్యూగో. మేధావంతుల జ్ఞాన సంపద పుస్తకాలలో ఆవిష్కరింపబడటం కారణంగా పుస్తకాలు మేధను ప్రభావితం చేస్తాయి. విప్లవాలు సృష్టిస్తాయి. నిజం చెప్పాలంటే పుస్తకం ఒక ఆయుధం. మంచికి, చెడు రెండింటికీ ఆధారం. బ్రిటిష్ పాలనను పారదోలే స్వాతంత్ర్య సమర పోరాటానికి ఉత్తేజం అందించిన బకించంద్రుని 'ఆనంద మఠం' నవల 'వందేమాతరం' అందించింది. గాంధీజీ 'హిందుస్వరాజ్' వినాయక దామోదర సావర్కార్ 1857 స్వరాజ్య సంగ్రామం' భారత స్వాతంత్ర్య సమర చరిత్రను సత్యాగ్రహం, సాయుధం రెండింటి లక్ష్యం వైపు నడిపించాయి.

ఎన్నో పుస్తకాలు, పత్రికలు స్వరాజ్య సమరంలో, స్వాతంత్ర్య సమరయోధులకు కరదీపికలుగా అగ్ని రగిలించాయి. గ్రంథాలయోద్యమం స్వాతంత్ర్య దీప్తి రగిలించింది. ప్రాచీనమైనా, నవ్యమైన, ఆధునిక, అధునాతనమైనా సమాజాన్ని జన జీవితాన్ని మేధావంతులే నడిపిస్తారు. ఏ దేశమైనా, ఏ ప్రాంతమైనా ఆలోచనా పరులైన మేధావులే మార్గదర్శకులుగా జనసామాన్యానికి శ్రేయోజీవన ఆశయాలతో సారథ్యం అందిస్తారు. ప్రస్తుతం మనం చూసే గ్రంథాలయాలలో, లక్షలాది గ్రంథాలలో కాలగతిలో భౌతికంగా కనుమరుగైన మేధావంతుల దిశా నిర్దేశాలు అక్షర రూపంలో పదిలంగా ఉన్నాయి. అందువల్లనే గ్రంథాలు వుండే ఆలయాలుగా గ్రంథాలయాలను ఆరాధించాలి, ఆదరించాలి.

స్వాతంత్ర్య సమర కాలంలో మన దేశంలో, బ్రిటిష్ వారిపై పోరాటం ఉత్తేజం చేయడం కోసం పుస్తక ప్రదర్శన ప్రప్రథమంగా సమరయోధులైన జాతినేతలు కలకత్తాలో నిర్వహించారు. అదే పుస్తకాల పండుగ. ఆ సంస్కృతి ప్రస్తుతం దేశవ్యాప్తం అయింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పుస్తక ప్రదర్శనలు జరుగుతున్నాయి. పుస్తకాలను ప్రేమించే పిల్లలకు, పెద్దలకు ఒక పండుగగా, పర్వదినంగా ప్రభుత్వం ప్రదర్శనలను ప్రోత్సహించాలి. చదువుల తల్లి సరస్వతిని ఆరాధించే విధంగా పుస్తక పండుగ అంతటా ప్రతీ యేటా ఘనంగా జరిపించాలి. అక్షరాభ్యాస సంప్రదాయం అనుసరిస్తున్నట్లు, పవిత్ర మత గ్రంథాలను పూజనీయంగా ఆరాధిస్తున్నట్టే, ఇంటింటా స్వతంత్ర గ్రంథాలయాలను ఆవిర్భవింపచేయాలి.

ప్రస్తుత స్థితిగతులలో గ్రామీణ గ్రంథాలయాలు మూతపడుతున్నాయి. పుస్తక పఠనాసక్తితో పాటు దినపత్రికలు చదవటం కూడా తగ్గిపోతోంది. టివి, ఎలక్ట్రానిక్ మీడియా శరవేగంగా సాధించిన పురోగతి, ప్రింట్ మీడియాను వెనక్కి నెడుతోంది. ప్రింట్ మీడియా పోటీకి తట్టుకుని నిలబడలేకపోవటంతో వార్తాపత్రికలు ప్రచురణ కూడా సమస్యలను ఎదుర్కొంటోంది. వ్యాపార ప్రకటనలు వాటికి కొంతవరకు మాత్రమే ఊరట యివ్వగలుగుతున్నాయి. క్రీడలు, సినిమాలు, పర్యాటకం, వినోదం, యాత్రలు వంటి అంశాలు మాత్రమే ప్రాధాన్యత పొందుతున్నాయి. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చేజిక్కించుకోవడానికి, పోటీ పరీక్షల పుస్తకాలు వర్తమాన విద్యా, వైజ్ఞానిక, శాస్త్రీయ, సాంకేతిక అంశాలపై మాత్రమే యువత దృష్టి సారించవలసి వస్తోంది.

అరచేతిలో ప్రపంచాన్ని ఇముడ్చుకొన్న సాంకేతికతా వెలుగుల ముందు, పుస్తకాలు నిస్తేజం కాకుండా జాగరూకత వహించవలసిన బాధ్యత ప్రధానంగా విద్యారంగంపై వుంది. శరవేగంగా మారుతున్న డిజిటల్ ప్రపంచంలో కొత్త తరానికి పఠనాసక్తి పెంపొందింపచేసే విధంగా ప్రాథమిక స్థాయి నుంచి పుస్తకం చదవడం నేర్పించాలి. మారుతున్న జీవన విధానంలో పుస్తక పఠనం కనుమరుగయ్యే ప్రమాదం పొంచి వుంది. విద్యావంతులు, రచయితలు, వివిధ రంగాల మేధావంతులు, ప్రధానంగా రాజకీయ నాయకులు ఈ నిస్తేజం నుంచి పుస్తకాన్ని రక్షించుకోవాలి.

**- జయసూర్య**

# విలువిద్యా పారంగతుడు

అర్జునునికి, చిత్రాంగదకు పుట్టినవాడు బభ్రువాహనుడు. సకల శాస్త్రాలు అభ్యసించాడు. అతడు విలువిద్యలో అత్యంత ప్రవీణుడు, కౌరవులంటే మహాయిష్టం అతనికి. పాండవులు, కౌరవుల మధ్య యుద్ధం జరుగుతున్నట్టు తెలిసి, తానూ ఆ యుద్ధంలో పాల్గొనాలనుకున్నాడు. బభ్రువాహనుడి కోరిక శ్రీకృష్ణుడికి తెలిసింది.

విలువిద్యలో ప్రవీణుడైన బభ్రువాహనుడు యుద్ధంలో కౌరవుల వైపు ఉండి, వారి పక్షాన యుద్ధం చేసినట్లయితే పాండవులు ఓడిపోతారేమోననే సందేహం కలిగింది కృష్ణుడికి. కనుక అతనిని యుద్ధంలోకి రాకుండా అడ్డగించాలనుకున్నాడు కృష్ణుడు. బభ్రువాహనుని వద్దకు వెళ్ళి "నువ్వు ఎంతోగొప్ప వీరుడివి. శూరుడివి. విలువిద్యలో నీకు సమానులు లేరు. నిన్ను ఎవరూ ఎదుర్కోలేరు. నీ విలువిద్య నైపుణ్యతనూ, నీ సాహసాన్ని చూడడంకోసం నీ దగ్గరకు వచ్చాను" అన్నాడు కృష్ణుడు.



ఆ మాటలకు బభ్రువాహనుడు పొంగిపోయాడు. "దేవా, నా శరాన్ని దేనికి గురి పెట్టాలి?" అని అడిగాడు బభ్రువాహనుడు.

కృష్ణుడు ఓ పెద్ద చెట్టుని చూపించి "ఆ చెట్టుకు ఒక్క ఆకు కూడా లేకుండా అన్నింటినీ పడకొట్టి, నీ విలువిద్యా ప్రావీణ్యాన్ని నాకు చూపించు" అన్నాడు. మరుక్షణమే బభ్రువాహనుడు కృష్ణుడికి నమస్కరించి బాణం వదిలాడు. ఆ బాణం చెట్టుకున్న ఆకులన్నింటినీ కూల్చి వేసింది. అయితే కృష్ణుడు ఒక ఆకును మాత్రం తన పాదంతో ఆ ఆకు కనిపించకుండా కప్పాడు.

గురితప్పని బభ్రువాహనుని బాణం, కృష్ణుని పాదంవైపు దూసుకొచ్చింది. అది గ్రహించిన కృష్ణుడు వెంటనే తన పాదాన్ని పక్కకు తీసేశాడు. ఆ బాణం ఆ ఆకును కూడా కూల్చివేసింది. బభ్రువాహనుని విలువిద్యా నైపుణ్యం, గురి చూసి బాణం వేయడంలోని అతని ఏకాగ్రతను కృష్ణుడు ప్రత్యక్షంగా చూశాడు. దాంతో కురుక్షేత్ర యుద్ధంలో బభ్రువాహనుడు ఎవరివైపు ఉంటే వారికి విజయం తథ్యమని తెలుసుకున్నాడు కృష్ణుడు.

బభ్రువాహనుడు "కృష్ణా, నా విలువిద్యను చూశారుగా. ఇప్పుడు చెప్పండి. నాకు కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొనే అర్హత ఉందా?" అని.

"నీ విలువిద్య అమోఘం. అద్భుతం. యుద్ధంలో పాల్గొనే అర్హత నీకు తప్పకుండా ఉంది" అతని భుజం తట్టాడు కృష్ణుడు. ఆ మాటలకు పొంగిపోయిన బభ్రువాహనుడితో "ఎవరి పక్షాన యుద్ధం చేయాలనుకుంటున్నావు?" అని ప్రశ్నించాడు కృష్ణుడు.

"పాండవులకు మీరెలాగూ అండగా ఉన్నారు కనుక వారికి విజయం తథ్యం. అందువల్ల నేను కౌరవుల పక్షాన పోరాడుతాను. ఓడిపోయేవారి పక్షాన ఉండి యుద్ధంలో పాల్గొని వారి ఓటమిని విజయం దశకు మార్చాలని నా కోరిక. అంతేకాదు, కర్ణుని పట్ల నాకు పూజ్యభావం, గౌరవమూ ఉన్నాయి. దుర్యోధనుడన్నా నాకు ఇష్టం" అని జవాబిచ్చాడు బభ్రువాహనుడు.

కానీ కృష్ణుడు ఏదోవిధంగా అతను యుద్ధరంగానికి రాకుండా చూడాలని భావించాడు.

"బభ్రువాహనా, ఈ యుద్ధంలో జయాపజయాలు సమానంగా ఉన్నాయి. కౌరవుల పక్షాన యుద్ధ నైపుణ్యాన్ని ప్రదర్శించే వీరులెందరో ఉన్నారు. వారి వెంట అపరిమిత సైన్యముంది. అలాగని పాండవులను తక్కువగా అంచనా వేయలేం. వారికీ గెలుపు లభించే అవకాశం ఉంది. నేను కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడి రథానికి సారథిగా మాత్రమే ఉంటున్నాను. వారికి నా సలహాలు ఇస్తానే తప్ప ఆయుధం పట్టుకోను. రెండు పక్షాలూ సమ ఉజ్జీలే. గెలుపోటములు వారిరువురే తేల్చుకోవడం సముచితం. కనుక నువ్వు తటస్థంగా ఉండడమే మంచిది" అని సలహా ఇచ్చాడు కృష్ణుడు.

కృష్ణుడి మీది భక్తిభావంతో సరేనని అంగీకరించాడు బభ్రువాహనుడు. అయినా మనసులో తాను యుద్ధంలో పాల్గొనలేకపోతున్నానని నిరుత్సాహం చెందాడు. తాను యుద్ధంలో పోరాడలేకపోయినా ఇరు పక్షాల యుద్ధాన్ని, వారి బలాబలాలనూ చూసే అవకాశం ప్రసాదించమని కోరాడు బభ్రువాహనుడు. అందుకు అంగీకరించిన కృష్ణుడు "అయితే, ఒక్క విషయం. రణరంగాన్ని మొత్తం నువ్వు చూసేలా నీ తలను తీయించి ఆ శిరస్సును ఒక పెద్ద వృక్షం మీద ఉంచితే నువ్వు యుద్ధాన్ని మొత్తం చూడగలుగుతావు. యుద్ధం పూర్తయ్యేంతవరకూ నీకు మరణం ఉండదు" అన్నాడు.

బభ్రువాహనుని శిరస్సు పాండవులు, కౌరవుల మధ్య జరిగే కురుక్షేత్ర యుద్ధాన్ని చూస్తూ అవసర సమయంలో కౌరవులకు సలహాలిస్తూ యుద్ధ వ్యూహాలను వారికి చెప్తూ వారు అధైర్యపడకుండా వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూ వారిని ప్రోత్సహిస్తూ కౌరవులను ఉత్సాహపరచసాగింది బభ్రువాహనుని శిరస్సు. అయినప్పటికీ కౌరవులు ఆ యుద్ధంలో అపజయం పాలవడంతో బభ్రువాహనుడు ఎంతగానో తల్లడిల్లిపోయాడు. ఉద్దండులైన వారెందరో కౌరవుల పక్షాన ఉన్నప్పటికీ వారి ఓటమిని బభ్రువాహనుడు జీర్ణించుకోలేకపోయాడు.

బభ్రువాహనుని కన్నీరే తమసానది రూపంలో ప్రవహిస్తోందని భక్తుల నమ్మకం.

**- యామిజాల జగదీశ్**

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్స్: 9885446501/9885449458






# 'దిక్కూఢం' అంటే ఏమిటి?

**కె.కరుణాకర్, విజయవాడ**

**ప్రశ్న: స్థలానికి, ఇంటికి దిక్మూఢం కలుగకూడదంటారు. అసలు ఈ 'దిక్మూఢం' అంటే ఏమిటి? విదిక్కులకు స్థలం/ఇల్లు ఉండటమంటే ఏమిటి? 'దిక్మూఢం', 'విదిక్కులు..' రెండూ ఒక్కటేనా? మా సందేహాలను నివృత్తి చేయగలరు.**

**జవాబు:** ఒక స్థలంగానీ, గృహంగానీ దిక్కులకు అనుగుణంగా లేక ఇష్టానుసారంగా ఉండటం వల్ల 'దిక్మూఢం' అనే దోషం ఏర్పడుతుంది. అంటే దిక్కు లేకపోవటం అనే అర్థంన వస్తుంది.

అయితే ఈ విషయంలో గృహాలకు సంబంధించి 15 డిగ్రీల వరకు తిరిగి ఉండటం వరకు వాస్తు సమ్మతం. ఆలయాల విషయంలో మాత్రం తప్పకుండా 0 డిగ్రీ ఉండవలసిందేనని ఆగమవాస్తు నియమానుసారం.

దిక్కులు మూలలకు, మూలలు దిక్కులకు విచ్చే విధంగా స్థలం, గృహం వుంటే అది 'విదిక్కులకు' ఏర్పడి దోషం కలుగుతుంది. అలా ఉండకూడదు.

## ఏం చేయాలి?

**సి.మహిజ, పుత్తూరు**

**ప్రశ్న: ఒక్కసారిగా ఈ విధమైన విపరీతాలు ఊహించలేకపోయాను. తట్టుకోలేకపోతున్నాం. మిమ్మల్ని కలవాలని అనుకుంటున్నాం. మీ అపాయింట్ దొరకటం కూడా చాలా కష్టంగా ఉంది. ఏం చేయమంటారు? మాకు తగిన సలహా చెప్పగలరు.**

**జవాబు:** మీ ఇంటికి నైరుతి మూలలో గోడకి ఒక 'మేకు' కొట్టబడి ఉంటుంది. దానిని మంగళవారం మధ్యాహ్న నాలుగు గంటలకు గోడలో నుండి పీకేసి ఇంటి బయట చెత్తకుండీలో పారేయండి. ముందు ఈ పని చేసి చూడండి. ఫలితం బాగుంటుంది. నన్ను కలిసే అవసరం రాకపోవచ్చు.

## స్థలం ఎలా ఉండాలి?

**ఎన్.పాండురంగం, కావలి**

**ప్రశ్న: ఇల్లు కట్టుకోవటానికి తీసుకునే స్థలం ఏ దిక్కుకు ఎత్తుగా ఉండాలి? ఏ దిక్కుకు పల్లంగా ఉండాలి? కొనబోతున్న స్థలం ఎలాంటి ఫలితాలను ఇస్తుందో ముందుగానే ఎలా తెలుస్తుంది?**

**జవాబు:** గృహ నిర్మాణ క్షేత్రంలో భూమి తూర్పు భాగం(ఇంద్రస్థానం) ఎత్తుగా వుంటే పుత్రనాశనం; ఆగ్నేయ భాగం(అగ్నిస్థానం) ఎత్తుగా వుంటే ధనలాభం; దక్షిణ భాగం(యమస్థానం) ఎత్తుగా వుంటే ఆరోగ్యం;

నైరుతి భాగం(నిరృతి స్థానం) ఎత్తుగా వుంటే ధనలాభం; పశ్చిమ భాగం(వరుణ స్థానం) ఎత్తుగా వుంటే పుత్రలాభం; వాయువ్య భాగం(వాయువు స్థానం) ఎత్తుగా వున్నట్లయితే ద్రవ్య లాభం; ఉత్తర భాగం(కుబేర స్థానం) ఎత్తుగా వున్నట్లయితే దారిద్ర్యం; ఈశాన్య భాగం(ఈశానుడి స్థానం) ఎత్తుగా వుంటే మహాక్లేశం కలుగుతుంది.

క్షేత్రం మధ్య భాగం పల్లంగా వుంటే ధననాశనం కలుగుతుంది. మిర్రుగా వున్నట్లయితే ఐశ్వర్యం కలుగుతుంది. ఈ విషయాన్ని ఎన్నో వాస్తుగ్రంథాల్లో ప్రస్తావించారు. •

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ............................................
పుట్టిన తేది : ............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................
చిరునామా:................................................

– ప్రతిభ, ప్రావీణ్యం, మేధస్సు.. ఎప్పటికయినా బయట పడతాయి. – సిమ్మన్స్

– అసాధారణ బాధల ఫలితమే ప్రతిభ. – లాంగ్‌ఫెలో

– నీవు ప్రతిభాశాలివి అయితే తప్ప అందరికీ అర్థమయ్యేటట్లు మాట్లాడటం ఉత్తమం.
– ఆంథోని హోప్

ఆలయదర్శనం

స్వర్గానికి స్థలం చాలన్నట్టు, భూలోకానికి దిగి వచ్చినట్టు, కనులకు విందు చేస్తున్నట్టు, హిమాలయ పర్వతసానువుల రక్షణలో ఒదిగినట్టున్న భూతల స్వర్గం నేపాల్.
హిమాలయాల్లోని శివాలిక్ రీజియన్ (అవుటర్ హిమాలయాలు)లో ఉన్న నేపాల్‌లో అధిక జనాభా హిందువులే. అతి ముఖ్యమైన మైనారిటీలు టిబెటన్స్, ముస్లింలు, క్రిస్టియన్లు. ఒకప్పుడు నేపాల్ అశోక సామ్రాజ్యంలో ఒక భాగంగా వుండేది.



# ప్రకృతి ఒడిలో పశుపతినాథుడు

కొన్ని శతాబ్దాలకు ముందు ఇది ఒక లోతైన చెరువు ప్రాంతం. రహస్య తంత్రవిద్యల వల్ల, అత్యంత పెద్దదైన బహిరంగ మరుభూమి వల్ల అందరికీ తెలిసిన ఈ ప్రదేశం పశుపతినాథుడైన ఆ మహాశివుని అరుదైన ఆలయ ఆధ్యాత్మిక సంపద వల్ల మరింతగా జగత్ప్రసిద్ధమైంది. అడుగు తీసి అడుగేస్తే అతి తక్కువ మందికి మాత్రమే తెలిసిన అనేక అంతుచిక్కని రహస్యాలు. ఎన్నో ప్రకృతి విపత్తులు, అనేక ఘోర పరిస్థితులు.. అయినా చెక్కుచెదరని గాంభీర్యం పశుపతినాథ ఆలయం.

నేపాల్ మాహాత్మ్యంలో రాయబడిన కథనం ప్రకారం- పశుపతినాథ శివలింగం స్వయంభువుగా వెలిసింది. శివుడు తన కైలాసాన్ని వీడి భాగమతి నదీ తీరాన ఇప్పుడు ఆలయం వున్న ప్రదేశానికి వచ్చాడు. ఇక్కడి పార్వతీ స్వరూపమైన ప్రకృతి సౌందర్యానికి పరవశుడై కొంతసేపు ఇక్కడే ఆగిపోయాడు. శివుడు కైలాసానికి ఎంతసేపటికీ తిరిగి రాకపోయేసరికి దేవతలు ఆందోళనతో విష్ణువుతో మొరపెట్టుకొంటారు. విష్ణువు శివుని ఉనికిని గ్రహిస్తాడు. శివుడిని తనతో తీసుకొనిపోవటానికి తానే స్వయంగా భూమిపై కాలు మోపుతాడు. శివుడు అందమైన, మూడు కొమ్ములున్న జింకరూపాన్ని ధరించి అటూ ఇటూ పరుగులు తీశాడు. విష్ణువు జింక కొమ్మును పట్టుకొని ఆపే ప్రయత్నం చేయగా- కొమ్ము విరిగి అక్కడే భూమిపై పడింది. శివుడు నిజరూపం ధరించి కైలాసానికి వెళ్తాడు. జింక కొమ్ము విరిగిపడిన ఆ స్థలంలో ఒక శివలింగం స్వయంభువుగా వెలిసింది. ఆ విధంగా శివుడే స్వయంగా వెలిసిన ఆ ప్రాంతంలో చాలాకాలం తర్వాత పశుప్రేక్షుడు అనే రాజు ఒక ఆలయాన్ని నిర్మించాడు. అదే ఇప్పుడు మనకు దర్శనమయ్యే పశుపతినాథ మందిరం.

శివుడిని శైవధర్మంలో అష్టనామాలతో పూజిస్తూ వుంటారు. అవి- రుద్ర, పశుపతి, శర్వ, ఉగ్ర, ఆశాని, భవ, మహాదేవ, ఈశాన. పశుపతినాథుని దర్శనంతో జీవునికి చావు, పుట్టుకలు దూరమవుతాయని భావిస్తారు. ఇప్పుడు మఖలింగంగా పిలువబడే పశుపతినాథుడు నాలుగు ద్వారాల నుండి నాలుగు ముఖాలతో దర్శనం ఇస్తూ వుంటాడు. ఈ నాలుగు ద్వారాలు వెండితో చేయబడి వుంటాయి. నాలుగు వేదాల మూలాలు ఇక్కడే ఆవిర్భవించాయని అంటారు. మంత్ర, తంత్రవిద్యలకు నాలుగు ముఖాలను నాలుగు ప్రాథమిక సూత్రాలుగా భావిస్తారు.

మరొక ఇతిహాసం ప్రకారం- కురుక్షేత్ర మహాసంగ్రామం ముగిసిన తర్వాత పాండవులు గో వధ చేశామనే అపరాధ భావంతో పాపాన్ని పరిహరింపచేసుకోవాలనుకొని శివుడిని వేడుకొందామని బయలుదేరారు. శివుడు ఒక వృషభ రూపాన్ని ధరించి వారికి దొరకకుండా పశువుల మందలో కలిసి తిరుగుతుంటాడు. అశరీరవాణి పలుకులతో నిజం తెలుసుకొంటారు పాండవులు. భీముడు వృషభ రూపధారి అయిన శివుడి దగ్గరకు వెళ్లేసరికి వృషభం దొరకకుండా మంచులో కూరుకుపోతుంది. భీముడు వృభం మూపురాన్ని గట్టిగా పట్టుకుంటాడు. అది శిలగా రూపాంతరం చెంది, కేదార్‌నాథ్‌లో శివలింగంగా వెలిసింది. మంచులో కూరుకు పోయిన తలభాగం హిమాలయాలలోని ఖాట్మండు (నేపాల్)లో ముఖలింగంగా, పశుపతినాథునిగా కొలువై వుంది. అయితే ఎప్పుడు వెలిసిందో స్పష్టమైన ఆధారాలు లేవు. వృషభం నాభి భాగం హిమాలయాల్లో మధ్యమహేష్ వద్ద అత్యంత శక్తివంతమైన మణిపూరక లింగంగా కనిపిస్తుంది. కొమ్ములు వున్న ప్రదేశం కల్పనాథ్‌గా ప్రసిద్ధం. కొన్ని పురాతన తాంత్రిక గ్రంథాల ప్రామాణ్యంగా శివునికి పంచ ముఖాలున్నాయి. వీటిని సద్యోజాత, వామదేవ, తత్పురుష, ఈశాన, అఘోర ముఖాలని అంటారు.

శివుని కాలాగ్నిరుద్ర రూపమైన ఐదో ముఖాన్ని తాంత్రికవిద్యను ఔపోసన పట్టిన మహాసాధకులు మాత్రమే దర్శించగలుగుతారని ప్రతీతి. అథర్వణ, యజుర్వేదాలు శివుడిని తంత్రదేవతగా వర్ణించాయి.అందుకే శివుని కాలభైరవ రూపం తంత్రవిద్యలకు ప్రసిద్ధం. ఖాట్మండు మీద జరిగిన సాంస్కృతిక అధ్యయనంలో ప్రతి యేటా ఒక పూర్ణిమరాత్రి ఇక్కడి కీర్తిముఖ భైరవ మందిరంలో తాంత్రిక పూజలు జరిపి, 5 వేర్వేరు జంతువులను బలి యిస్తారు. ఇది కీర్తిముఖ భైరవుని ప్రసన్నం కోసం చేసే పూజ.

ఆలయం వెనుక భాగంలో ఆర్యఘాట్‌లో నిరంతరం చితులు రగులుతూ వుంటాయి. ఎవరి శరీరం ఆర్యఘాట్‌లో అంతిమ సంస్కారానికి నోచుకుంటుందో, వారి ఆత్మ జనన-మరణ చక్రబంధ ముక్తమవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రకృతివిపత్తులను చిత్తుచేస్తున్నట్టు, ఏ పరిస్థితికీ తలవంచనట్టు పశుపతినాథ ఆలయంలో అఖండజ్యోతి వేలాది సంవత్సరాలుగా స్థిరంగా ప్రజ్వలిస్తూనే వుంది. ఈ జ్యోతి మహాశివుని నిజరూపంగా భక్తులు నమ్ముతారు. ఈ జ్యోతి ప్రకాశాన్ని దర్శించినవారికి చెడుశక్తులు దూరమవుతాయని భావిస్తారు. ముఖలింగంలో తూర్పును చూస్తున్నట్టు వున్న ముఖం మతాన్ని సూచిస్తుంది.

దక్షిణ ముఖం సంపదను, పడమర ముఖం ఇచ్ఛను, ఉత్తర ముఖం మోక్షాన్ని సూచిస్తుంది. గర్భగుడిలో ప్రత్యేకంగా కర్ణాటకకు చెందిన నలుగురు భట్ పూజారులు మాత్రమే కఠిన నియమాలకు లోబడి పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తూ వుంటారు. శివుడు కైలాసం నుంచి ఇక్కడకు వచ్చినప్పుడు ఆయన సంకల్పం ద్వారా భాగమతి నది ఉద్భవించిందని చెబుతారు. అందుకే ఈ నది నీరు మహాశివుని ప్రసాదంగా భావిస్తారు. పశుపతినాథుని ఎదురుగా నంది ధ్యానముద్రలో నిశ్చలంగా వుంటుంది. నంది కళ్లలో శివలింగం ప్రతిఫలిస్తూ వుంటుంది.

ఈశ్వరాంశ సంభూతునిగా కీర్తింపబడిన జగద్గురు ఆదిశంకరాచార్యులు ఆరంభించిన సంప్రదాయం ప్రకారమే పశుపతినాథ ఆలయంలో పూజలు నేటికీ కొనసాగుతూ వున్నాయి. మానవుడు తనలోని పశుత్వాన్ని విడచి దైవత్వాన్ని పొందాలంటే ముందుగా పశుపతినాథుని దయకు పాత్రులు కావాలన్నదే ఆదిశంకరుల ప్రబోధం.

## గుహ్యేశ్వరీమాత

చిదగ్నికుండ సంభూతమైన ఆ మహాపరాశక్తి గుహ్యేశ్వరీమాతగా, ఖాట్మండులో కొలువై వుంది. ఈమెనే గుహ్యేశ్వరీ, గుహ్యకాళీగా కూడా పూజిస్తూ వుంటారు. గుహ్యేశ్వరీమాత ఆలయం నేపాల్‌లోనే ప్రసిద్ధ శక్త్యాలయం. హిందువులకు ముఖ్యంగా తాంత్రిక ఆరాధకులకు ఎంతో ముఖ్యమైన క్షేత్రం. లలితాసహస్ర నామాలలో 707వ దేవీనామం గుహ్యరూపిణిగా అమ్మవారు వర్ణింపబడింది. గుహ్య అంటే రహస్యం. ఈశ్వరీ అంటే దేవత. గుహ్యేశ్వరీ అంటే రహస్యదేవత అని అర్థం. సతీదేవి దేహం ముక్కలు గావింపబడినప్పుడు తుంటి వెనుకభాగం ఇక్కడ పడిందని కొందరు, నాభి దిగువ భాగం పడిందని మరికొందరు, మోకాలి భాగమని ఇంకొందరు విశ్వసిస్తూ వుంటారు. ప్రతి శక్తిపీఠం ఒక శక్తిదేవతకు, ఒక కాలభైరవునికి అంకితం



చేయబడి వుంటుంది. గుహ్యేశ్వరీమాత ఆలయంలో అతిభయానక ప్రచండ రూపమైన కాలభైరవుడిని కపాలి అని పిలుస్తారు. ఆలయ మధ్య భాగంలో వెండి, బంగారు పొరతో కప్పబడివున్న ఒక కలశం వుంటుంది. ఈ కలశం నీటితో నిండి వుంటుంది. ఒక రాతి నిర్మాణంపై వున్న ఈ కలశాన్ని అమ్మవారిగా పూజిస్తారు ఈ రాతి పునాది కింద భూగర్భజలాలు వున్నాయి. కలశం భూగర్భం నుంచి వచ్చే నీటిబుగ్గను కప్పి వుంచుతుంది. కలశం నుంచి నీరు పునాది అంచుల వరకు ఉబికి వస్తూ వుంటుంది. గుహ్యేశ్వరీ మాత తాంత్రిక ఆరాధకుల చేత ఆరాధింపబడుతోంది. ఈ ఆలయం గురించి కాళీతంత్రం, శివతంత్రం, చండీతంత్రం వంటి పురాతన తాంత్రిక గ్రంథాలలో ప్రముఖంగా ప్రస్తావించబడింది. తంత్రశక్తిని పొందేందుకు అత్యంత శక్తివంతమైన ప్రసిద్ధ ఆలయంగా భావిస్తూ వుంటారు. శ్రీచక్ర రాజనిలయ వాసినిగా విరాజమానమైన ఆ మహాశక్తి విశ్వరూపాన్ని అసంఖ్యాకమైన చేతులతో, అనేక వర్ణాల తలలు కలిగినదిగా వర్ణింపబడుతుంది. ఆలయ నిర్మాణం భూటాన్ పగోడా శైలిలో వుంటుంది. నవారి వజ్రయాన బౌద్ధులు ఈ మాతను వజ్రవారాహీ రూపంలో వజ్రయోగినిగా ఎంతో పవిత్రంగా పూజిస్తారు. వీరు స్వయంభూ నాథ్ స్థూపం వున్న పౌరాణిక కమలం మూలస్థానంగా భావిస్తారు. ఈ ఆలయం బావిలో వున్న నీటిబుగ్గ నుంచి ప్రవహించే నీటిని వజ్రవారాహీ జలాలుగా విశ్వసిస్తారు. పశుపతినాథుడిగా పూజలందుకొంటున్న ఆ మహాశివుని కన్నా ముందు ఆ పరాశక్తి రూపమైన గుహ్యకాళీని దర్శించటం సంప్రదాయంగా వస్తుంది. అమ్మవారిని కలశరూపంలో పూజిస్తూ వున్న ఏకైక శక్తిపీఠం ఇదే. గుహ్యేశ్వరీ పశుపతినాథులుగా భాసిస్తున్న ఆ ఆదిదంపతుల దర్శనం పాపనాశనం.

– సిహెచ్.పద్మ


### సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు.. వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్:.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080**

**sunmagvaartha@gmail.com**

# పర్యావరణహిత చేతి సంచులు

**నేడు ప్లాస్టిక్ క్యారీబ్యాగులు వాడటం వల్ల పర్యావరణ కాలుష్యం పెరిగిపోతుందనేది అందరికీ తెలిసిన విషయమే. చేతిసంచులు అందంగా లేవనే సాకుతో వాటిని చేత పట్టుకోని మార్కెటుకు వెళ్లడానికి కొందరు సిగ్గుపడుతుంటారు.**

అయితే ప్రస్తుతం జనపనార, పత్తి, వెదురు ఇత్యాది వాటితో చేసిన అందమైన చేతిసంచులు అనేక రాష్ట్రాలలో అందుబాటులోకి వచ్చాయి. వీటిని చిన్నా పెద్దా తేడా లేకుండా ఉపయోగిస్తూ పర్యావరణాన్ని కాపాడటానికి చాలా మంది తమ వంతు కృషి చేస్తున్నారు. పర్యావరణహిత ఆధునిక నారసంచులను ప్లాస్టిక్ సంచులకు బదులుగా పర్యావరణ అనుకూలమైన ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తున్నారు. ఈ సంచులు సహజమైన, పునర్వినియోగపరచదగిన నారల నుండి తయారవుతాయి. ఇవి కాలుష్యాన్ని తగ్గించడంలో, సుస్థిరతను ప్రోత్సహించడంలో సహాయపడతాయి.

## తయారీ వనరులు

సహజ నారలు అనేవి జనపనార, పత్తి, అరటి బోదెలు, వెదురు వంటి సహజ నారల నుండి తయారవుతాయి. ఈ నారలు పర్యావరణానికి ఏమాత్రం హాని చేయవు. ఇవన్నీ పునర్వినియోగ నారలు. ఇవి వ్యర్థాలను తగ్గిస్తాయి. భారతదేశంలో జనపనార సంచులు ప్రముఖంగా కానవస్తున్నాయి. ఎందుకంటే జనపనార స్థానికంగా లభ్యమవుతుంది. దీని ఉత్పత్తి స్థానిక రైతులకు ఆర్థిక ప్రయోజనాలను అందిస్తుంది.

## పర్యావరణ ప్రయోజనాలు

ఈ సంచులు సహజంగా కుళ్ళిపోయి త్వరగా మట్టిలో కలిసిపోతాయి. ప్లాస్టిక్ సంచుల వల్ల కలిగే దీర్ఘకాలిక కాలుష్యాన్ని నివారిస్తాయి. సహజ నారల సంచులు కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తాయి. నారసంచులు మన్నికైనవే కాక పలుమాసాలు ఉపయోగించడానికి అనువుగా ఉంటాయి. దీనివల్ల ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ సంచుల వినియోగం తగ్గుతుంది. నార సంచులు వ్యర్థాలను తగ్గించడంలో సహాయపడతాయి. ఎందుకంటే ఇవి పునర్వినియోగపరచదగినవి. కంపోస్ట్ తయారీకి ఉపయోగపడతాయి. పర్యావరణహిత సంచులు వాడటం వల్ల కలిగే లాభాలు ఉన్నాయి. పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. భూమి, నీరు కలుషితం కాకుండా ఉంటాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గడంతో జంతువులకు, పక్షులకు కలిగే హాని తగ్గుతుంది. ఈ సంచులు చాలా కాలం మన్నికగా ఉంటాయి. కాబట్టి తరచూ కొత్తవి కొనాల్సిన అవసరం ఉండదు. ఈ రకమైన సంచులను వాడటం ద్వారా మనం పర్యావరణాన్ని కాపాడడంలో మన వంతు పాత్ర పోషించవచ్చు. పర్యావరణహితమైన వస్త్రంతో తయారు చేసిన సంచులు పర్యావరణాన్ని పరిరక్షించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. పర్యావరణహిత వస్త్ర సంచులు చాలా తక్కువ సమయంలో భూమిలో కలిసిపోతాయి.

## రంగు రంగుల నార సంచులు

ఆధునిక నార సంచులు ఆకర్షణీయమైన డిజైన్లు, రంగులతో తయారవుతున్నాయి. ఇవి ఫ్యాషన్‌కు



అనుగుణంగా ఉంటాయి. ఈ సంచులు బలంగా, మన్నికకు మారుపేరుగా ఉంటాయి. బరువైన వస్తువులను సైతం మోసుకెళ్లడానికి అనుకూలంగా ఉంటాయి. షాపింగ్, గిఫ్ట్ ప్యాకింగ్, రోజువారీ ఉపయోగం, ప్రమోషనల్ ఈవెంట్లు వంటి వివిధ అవసరాలకు ఉపయోగించబడతాయి. వినూత్న సాంకేతిక పరిజ్ఞానంతో కొన్ని సంచులు జల నిరోధక లక్షణాలతో తయారవుతాయి. ఇవి ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఉంటాయి. జనపనార, పత్తి వంటి నార సంచుల ఉత్పత్తి స్థానిక కళాకారులు, రైతులు, చిన్న పరిశ్రమలకు ఉపాధి అవకాశాలను కల్పించడంతో ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు నెరవేరుతున్నాయి. ఈ సంచుల వాడకం వల్ల పర్యావరణ సంరక్షణ గురించి ప్రజలలో అవగాహన పెంచుతుంది. భారతదేశంలో, ప్లాస్టిక్ నిషేధం కారణంగా జనపనార, పత్తి సంచుల వాడకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రిటైల్ దుకాణాలు, సూపర్ మార్కెట్లు, ఈకామర్స్ సంస్థలు బ్రాండింగ్ కోసం ఈ సంచులను ఉపయోగిస్తున్నాయి. పర్యావరణ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు ఈ సంచుల వాడకాన్ని ప్రచారం చేస్తూ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, ఒడిశాలలో విస్తృతంగా నార సంచులను ఉత్పత్తి చేస్తున్నారు. ఇవి షాపింగ్ బ్యాగులు, గిఫ్ట్ బ్యాగులు, ప్రమోషనల్ బ్యాగులుగా ఉపయోగపడతాయి. సేంద్రీయ పత్తితో తయారైన సంచులు మృదువైనవి.



కొన్ని సంస్థలు మొక్కజొన్న, వెదురు, అరటి ఫైబర్ నుండి తయారైన సంచులను అందిస్తున్నాయి, ఇవి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతాయి.

## జనపనార సంచుల వల్ల కలిగే ప్రయోజనాలు

జనపనార సంచులు సహజమైన జనపనార మొక్కల నుంచి తయారవుతాయి. ఈ సంచులు పూర్తిగా బయో-డిగ్రేడబుల్. అంటే ఇవి వాటంతట అవే సహజంగా మట్టిలో కలిసిపోతాయి. దీని వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని జరగదు. ఈ సంచులు చాలా బలంగా ఉంటాయి. అందుకే వీటిని చాలా కాలం పాటు పదే పదే ఉపయోగించుకోవచ్చు. జనపనార మొక్కలు త్వరగా పెరుగుతాయి. వీటికి ఎక్కువ నీరు, పురుగుమందులు అవసరం లేదు. దీనివల్ల ఇవి పర్యావరణానికి మరింత మేలు చేస్తాయి. జనపనార సంచులు గాలిని లోపలికి, బయటికి వెళ్లనిస్తాయి. అందువల్ల, కూరగాయలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలు ఎక్కువ కాలం తాజాగా ఉంటాయి.



## ఆధునిక జనపనార సంచుల ప్రత్యేకతలు

ఒకప్పుడు పాత జనపనార సంచులు ఒకే రకంగా ఉండేవి. కానీ ఆధునిక జనపనార సంచులలో చాలా రకాల డిజైన్లు, రంగులు, ఆకర్షణీయమైన రంగు రంగుల ప్రింట్లతో లభిస్తున్నాయి. కొన్ని ఆధునిక సంచులకు లోపల వాటర్‌ప్రూఫ్ లైనింగ్ ఉంటుంది. ఇది ఆహార పదార్థాలను తేమ నుంచి రక్షిస్తుంది. కొన్ని సంచులు చాలా సులభంగా, చిన్నగా మడుచుకోవచ్చు. దీనివల్ల వాటిని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లొచ్చు. ఈ సంచులను షాపింగ్‌తో పాటు, పుస్తకాలు, ల్యాప్‌టాప్‌లు, జిమ్‌కు, బీచ్‌కు వెళ్లేటప్పుడు కూడా ఉపయోగించవచ్చు. ఆధునిక సంచులు సహజంగా లభించే మొక్కజొన్న పిండి, బంగాళాదుంపల వంటి వాటి నుంచి తయారవుతాయి. ఇవి భూమిలో కలిసిపోయి పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవు. సాధారణ ప్లాస్టిక్ సంచుల మాదిరిగా ఇవి వందల సంవత్సరాల పాటు భూమిలో ఉండవు. వాడేసిన కాగితాన్ని తిరిగి ఉపయోగించి కొన్ని రకాల సంచులను తయారు చేస్తారు. ఇవి తేలికగా ఉంటాయి. అలంకరణ కోసం వీటిపై రకరకాల డిజైన్లు వేయవచ్చు.

జ్యూట్ (గోగునార)తో తయారు చేసే కొన్ని రకాల సంచులు చాలా దృఢంగా ఉంటాయి. వీటిని మళ్ళీ మళ్ళీ ఉపయోగించవచ్చు. ఇవి కూడా పర్యావరణానికి మేలు చేస్తాయి. పత్తి, జనపనార వంటి సహజమైన నిర్మాణాల రకమైన సంచుల తయారీని ప్రోత్సహిస్తున్నాయి. కర్ణాటకలోని బెంగళూరు, మైసూరు వంటి నగరాల్లో బయోడిగ్రేడబుల్, కాగితం ఆధారిత సంచుల తయారీ జరుగుతోంది. స్థానిక చిన్న పరిశ్రమల్లో తయారీదారులు ఈ రంగంలో చురుకుగా పనిచేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి ఇత్యాది ప్రాంతాల్లో కాగితం, జనపనార ఆధారిత సంచుల తయారీ జరుగుతోంది. రాజమండ్రిలో కాగితం పరిశ్రమలు ఈ రకమైన సంచుల ఉత్పత్తికి దోహదపడుతున్నాయి. రాజస్థాన్‌లోని జైపూర్, ఉదయపూర్‌లో సంప్రదాయ జనపనార, చేనేత ఆధారిత సంచులు తయారవుతున్నాయి. రాజస్థాన్‌లో చేనేత సంచులు రంగు రంగుల డిజైన్లతో ప్రసిద్ధి చెందాయి. పశ్చిమ బెంగాల్‌లో కోల్‌కత్తా దుర్గాపూర్‌లో జనపనార ఆధారిత సంచుల తయారీ జరుగుతోంది. ఈ రాష్ట్రంలో జనపనార ఉత్పత్తి ఎక్కువగా ఉండడం వల్ల ఈ సంచుల తయారీ సులభతరం అవుతోంది. మహారాష్ట్రలోని ముంబై, పూణె, నాగ్‌పూర్‌లో జౌళి, కాగితం ఆధారిత సంచుల తయారీ జరుగుతోంది. ముంబై, పుణెలో ప్లాస్టిక్ బ్యాగ్‌లపై నిషేధం కారణంగా జనపనార, పత్తి సంచుల వాడకం బాగా పెరిగింది. స్థానిక మార్కెట్లు, షాపింగ్ మాల్స్ లో ఈ సంచులు సర్వసాధారణం. కేరళలో పర్యావరణ అవగాహన ఎక్కువ కావడంతో, కొబ్బరి ఆకులు, జనపనార, కాగితం ఆధారిత సంచుల వాడకం విస్తృతంగా కనిపిస్తుంది. తిరువనంతపురం, కొచ్చిలో ఈ సంచులు బాగా ప్రాచుర్యంలో ఉన్నాయి.

రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, తమిళనాడులో సంప్రదాయ చేనేత ఆధారిత సంచులు రంగు రంగుల డిజైన్లతో ప్రజాదరణ పొందాయి. పర్యావరణానికి హాని కలిగించని చేతి సంచులను మన దేశంలో విస్తృతంగా తయారు చేస్తున్నారు.

## వెదురు సంచులు

వెదురుతో తయారైన రకరకాల, రంగు రంగుల చేతి సంచులు భారతదేశంలో అనేక ప్రాంతాల్లో తయారవుతున్నాయి. వెదురు ఎక్కువగా లభించే ఈశాన్య రాష్ట్రాలలో వీటి తయారీ ఎక్కువగా జరుగుతుంది. ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, త్రిపుర, మేఘాలయ, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్ వంటి రాష్ట్రాల్లో వెదురు ఉత్పత్తుల తయారీ ముఖ్యమైన కుటీర పరిశ్రమ. ఇక్కడ వెదురు నుంచి చేతిసంచులు, బుట్టలు, కుర్చీలు, బొమ్మలు, ఇంకా అనేక రకాల వస్తువులు తయారు చేస్తారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ఇత్యాది రాష్ట్రాల్లోనూ వెదురుతో వస్తువులు తయారు చేసే కళాకారులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అటవీ ప్రాంతాల్లో వెదురుకు మంచి ప్రాధాన్యత ఇస్తున్నారు. వెదురుతో చేసిన చేతిసంచులు పర్యావరణ హితంగా ఉండటంతో, ఈశాన్య రాష్ట్రాలతో పాటు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిచ్చే హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో వీటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

**- షేక్ అబ్దుల్ హకీం జాని**

# 28 సెప్టెంబరు, 2025 నుండి 1 అక్టోబరు, 2025 వరకు

## వారఫలం



శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795

### మేషం

ఈ వారం సంఘ సేవ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారు. కుటుంబ పరమైన టువంటి సర్దుబాట్లు అధికంగా ఉంటాయి. ఇంట్లో కొంతమంది ప్రవర్తన బాలేక ఇంట్లో అప్రశాంత వాతావరం ఏర్పడుతుంది. అరటి నార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి. వీరి ద్వారా కుటుంబంలో కలహాలు ఏర్పడతాయి. సఖ్యత లోపిస్తుంది

### వృషభం

ఈ వారం ప్రతి ఒక్క అంశం గురించి కొన్ని విషయాల గురించి పూర్తి అవగాహన కలిగి ఉంటారు. అత్తగారి తరపు బంధువులతో విసిగిపోతారు. దూర ప్రాంత ప్రయాణాలు అంతంత మాత్రంగా ఉంటాయి. ప్రయాణాలు అసౌకర్యంగా ఉంటాయి. కుటుంబ పురోగతి బాగుంటుంది. పూజల్లో నాగబంధం కుంకుమను ఉపయోగించండి. ఎన్నో రోజులుగా మీరు ఎదురు చూస్తున్న శుభవార్తని వినగలుగుతారు.

### మిథునం

ఈ వారం విదేశాలలో ఉన్నవారికి సొంత ఇంటి కల నెరవేరుతుంది. విదేశీ అవకాశాల కోసం చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి. బ్యాంకు ఉద్యోగస్తులకు బాగుంటుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల సంఘసేవ కార్యక్రమాల పట్ల ఆకర్షణ కలిగి ఉంటారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. దీర్ఘకాలిక సమస్యల నుండి బయట పడదానికి చేసే ప్రయత్నాలు కలిసి వస్తాయి.

### కర్కాటకం

ఈ వారం క్రయ విక్రయాలలో లాభాలను అందుకుంటారు. నూతన భాగస్వాముల పట్ల రకరకాల అనుమానాలతో మీరు ప్రవర్తిస్తారు. ప్రేమ విషయ వ్యవహారాలు మీకు అంతగా నచ్చకపోవచ్చు. ప్రేమ వైఫల్యం చెందుతుంది. సౌర కంకణాన్ని ధరించండి ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఇంట్లో శుభకార్యాలు సంబంధించిన ప్రస్తావన ముడి పడుతుంది.

### సింహం

ఈ వారం చేస్తున్న పనులలో ఆటంకాలు ఎదురైనప్పటికీ ధైర్యంగా ముందుకు ఎదురు ఈదుతారు. కళా సాంస్కృతిక రంగాల్లో ఉన్నవారికి కాలం అనుకూలంగా ఉంటుంది. దైవ కార్యక్రమాలలో పాల్గొనగలుగుతారు. దైవదర్శనాలు చేసుకోగలుగుతారు. అష్టమూలిక తైలంతో లక్ష్మీ తామర వత్తులతో దీపారాధన చేయండి. జీవిత భాగస్వామి పట్ల మంచి అభిప్రాయాన్ని కలిగి ఉంటారు.

### కన్య

ఈ వారం పుస్తక పఠనం మిమ్మల్ని ఆకర్షిస్తుంది. బ్యూటీ పార్లర్ వ్యాపారస్తులకు యోగ ఇన్స్టిట్యూట్స్ నడిపే వారికి కాలం అనుకూలంగా ఉంటుంది. నూతన వస్తువులు వస్త్రాలు విలువైన ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఎరుపు వత్తులు అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. కొన్ని విషయాలలో అయిన వాళ్ళకు కూడా తెలియకుండా రహస్య కార్యక్రమాలను తలపెట్టి విజయవంతంగా పూర్తి చేస్తారు.

### తుల

ఈ వారం కొత్త ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి. నూతన పరిచయం ద్వారా ప్రయోజనాలు దక్కించుకుంటారు. సుదీర్ఘమైన ఫోన్ సంభాషణ ద్వారా కొంతమందికి మీ మీద ఉన్న అభిప్రాయాన్ని తెలుసుకుంటారు. పూజల్లో నాగ సింధూరం కుంకుమను ఉపయోగించండి. సహోదర సహోదరీ వర్గంతో ఉన్న మాట పట్టింపులు తొలగించుకుంటారు. డయాగ్నస్టిక్స్ సెంటర్ వారికి మెడికల్ షాపు వారికి అధిక లాభాలు పొందగలుగుతారు.

### వృశ్చికం

ఈ వారం కొత్త ప్రాజెక్టుల కోసం ప్రయత్నాలు మొదలుపెడతారు. ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా సోషల్ మీడియా ద్వారా ప్రచారాన్ని ముమ్మరం చేస్తారు. అనుకున్న కార్యక్రమాలలో పురోగతి కోసం స్నేహితుల సహాయాన్ని ఆశిస్తారు. అరటినార వత్తులతో అష్టమూలికా తైలంతో దీపారాధన జరిపించండి. వినోదభరితమైన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. పొలాలు పంటలకు సంబంధించిన అంశాలు ఆకర్షిస్తాయి.

### ధనస్సు

ఈ వారం వినోద కార్యక్రమాలకు ఎక్కువ ప్రాముఖ్యతనిస్తారు. ఏ పనిని చేపట్టినా విజయవంతంగా పూర్తి చేస్తారు. షేర్లు భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. మిత్ర బృందంతో చర్చలు సాగిస్తారు. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. స్వల్పమైన అనారోగ్య సమస్యలతో సతమతమవుతారు. కొంతమంది వల్ల నిరాశ ఎదురవుతుంది ఆశించిన స్థాయిలో వారి అండదండలు లభించకపోవచ్చు.

### మకరం

ఈ వారం ముఖ్యమైన చర్చలను, ముఖ్యమైన అన్ని విషయాలను సాధ్యమైనంతవరకు తాత్కాలికంగా వాయిదా వేసుకోవడం మంచిది. శ్వేతార్క గణపతికి సుమంగళి పసుపు, సిద్ధ గంధం, ఆరావళి కుంకుమతో పూజ చేయండి. వాస్తుదోషాలు నశిస్తాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తిని కనబరుస్తారు. యాంత్రికంగా పనులను పూర్తి చేస్తారు. సహోద్యోగులతో సఖ్యత ఏర్పడుతుంది.


### కుంభం

ఈ వారం పోటీ పరీక్షల్లో పాల్గొంటారు. గణితం విద్య, వైద్య విద్య, ప్రభుత్వ ఉద్యోగం కోసం రాసే పరీక్షల్లో విజయం సాధిస్తారు. పరపతి పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన ఉద్యోగ అవకాశాల కోసం చేసే దరఖాస్తులు, ఇంటర్వ్యూ ఫలిస్తాయి. పూజలలో ఆరావళి కుంకుమను ఉపయోగించండి. అష్టమూలిక తైలంతో లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి.


### మీనం

ఈ వారం వ్యాపార స్థలాలలో ప్రత్యేకించి ఉద్యోగస్తులతో సమస్యలు, విపరీతంగా మారతాయి. అభద్రతా భావాన్ని కలిగి ఉంటారు. కొన్ని కార్యక్రమాలను అర్ధాంతరంగా ఆపివేయవలసిన పరిస్థితులు ఏర్పడతాయి. మహా పాశుపత కంకణం ధరించండి ఉద్యోగ ప్రాప్తి కలుగుతుంది. కోర్టు వ్యవహారాది తీర్పులు అంతంతమాత్రంగానే ఉంటాయి.

# ఈ వారం కార్టూన్స్


మాఫీ కావాలంటే ఒక టీవి, దర్జా, పలుకుబడి, కొన్ని వందల కోట్ల అప్పు ఉండాలి..
తొక్కలో లక్ష రూపాయల అప్పు కూడా లేదు ఎలా అడుగుతున్నావు ....!!?
బ్యాంకు మేనేజరు


మొదటి రాత్రే భార్య పుల్లమ్మ కత్తి పోట్లకు నేలకొరిగిన అమర వీరుడు కామ్రేడ్ పుల్లన్న
01.09.2015
భర్త మరణం జీర్ణించుకోలేక తనువు చాలించిన మహా సాధ్వి కే. కే. పుల్లమ్మ
01.09.2025


.. నాది మాత్రం 'ఆర్గానిక్' ప్రేమ మేడం!!





కెలిముటు పర్వతం దగ్గర వున్న మూడు సరస్సులు వివిధ వర్ణాలతో పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. ఈ పర్వతం ఇండోనేషియాలో వుంది. భూగర్భంలోని ఖనిజాలు, అక్కడి అగ్ని పర్వతం నుంచి వచ్చే వాయువుల వల్ల ఈ సరస్సుల్లోని నీళ్లు ఎరుపు, ఆకుపచ్చ, నీలం మొదలైన రంగుల్లో వుంటాయి.



